నమ్మలేని నిజాలు

తోడు దొంగలు
తెరవెనుక చిత్రం
మత్తులో జనం.


మేఘ విస్ఫోటం
కార్లు ఓడలవ్వడం
వర్ష తాండవం.

ఒక రూపాయి
నారికేళంగా కట్నం
నూతన పంథా.

పాత బావులు
దాహానికి గుర్తులు
కాల రేఖలు.

యుద్ధ జ్వాలలు
చిరు బతుకుల్బలి
కుర్చీలు క్షేమం.

- రేడియమ్
సెల్: 9291527757



# నేటి నిజం
తెలుగు దినపత్రిక

తెలంగాణ కాంగ్రెస్ లో
రేవంత్ సురేఖల లొల్లి !
ఇద్దరి మధ్య సరిదిద్ది
తీర్చిదిద్దునా ఢిల్లీ !
క్రమశిక్షణల చర్యతో
కొండను ఢీకొట్టేనా ?
బర్తరఫ్ సిఫారసనుట
ఉత్త చెత్త బుట్టేనా ?

- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

శ్రీనిజాలు



website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 27-8-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :33 సంచిక:21 పేజీలు:6 వెల: రూ.1/-


# నేపాల్‌లో ఆకస్మిక వరదలు.. 1000 మంది గల్లంతు..



న్యూఢిల్లీ, ఆగష్టు 26: నేపాల్‌లో ఆకస్మిక వరద బీభత్సం సృష్టించింది. వరద కారణంగా ఒక ఊరు కొట్టుకుపోయింది. ఈ ఘటన నేపాల్-టిబెట్ సరిహద్దులోని రసువా జిల్లాలోని ఒక గ్రామంలో బుధవారం ఉదయం 9.00 గంటలకు జరిగింది. ఆకస్మికంగా సంభవించి వరద కారణంగా ఊరు కొట్టుకుపోగా.. ఊరిలోని 1,000 మంది వరకు ఇందులో కొట్టుకుపోయినట్లు తెలుస్తోంది. వరదలో కొట్టుకు పోయిన వారిలో 105 మంది భారతీయులు ఉన్నట్లు తెలుస్తోంది..

ఈ ఘటన గురించి సమాచారం అందుకున్న రెస్క్యూ బృందాలు సహాయక చర్యలు ప్రారంభించాయి. ఇంకా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. అలాగే, చుట్టుపక్కల ప్రాంతంలోని ప్రజలు సురక్షిత, ఎగువ ప్రాంతాలకు తరలి వెళ్లాల్సిందిగా అధికారులు సూచించారు. ఈ ఘటన జరిగింది నేపాల్‌లోని రసువా జిల్లాలోని స్యాప్రు బేసి, టిమురే ప్రాంతాల్లో. ఇది పర్వత ప్రాంతం. పైగా ఇక్కడ భోటె కోషి అనే నది ఉంది. ఈ నది టిబెట్ నుంచి నేపాల్‌వైపు ప్రవహిస్తుంది. ఈ నదిలో నీరు ఉప్పొంగడంతోపాటు, దిగువ లోయ ప్రాంతం కావడం వల్ల ఇక్కడ భారీ వరద సంభవించింది.

వరద ప్రభావిత ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన సహాయ చర్యలు మొదలయ్యాయి. అధికారులు 15 హెలికాప్టర్లను రంగంలోకి దించారు. సహాయక సిబ్బంది బుసి, తుసు ప్రాంతాల్లో 20 మందిని రక్షించారు.

గాయపడ్డ వారిని మచిలి ట్రైనింగ్ క్యాంప్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. నదీ పరివాహక ప్రాంతాల్లో నివసించే వారు వెంటనే అక్కడినుంచి సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోవాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. అధికారులు ఇప్పటి వరకు 8 మృతదేహాలను నీటినుంచి స్వాధీనం చేసుకున్నారు.

వరద కారణంగా ఊరితోపాటు ఇక్కడ ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టు కూడా కొట్టుకుపోయింది. దీంతో భారీ నష్టం వాటిల్లిందని నేపాల్ ప్రభుత్వం అంటోంది. ప్రస్తుత వరద నేపథ్యంలో త్రిషూలి నదీ పరివాహక ప్రాంతంతోపాటు నువా కోట్, ధాడింగ్, చిత్వాన్, గోర్ఖా ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ప్రజలు ఎగువ ప్రాంతాలకు తరలి వెళ్లాలని సూచించింది. ఈ వరద కారణంగా ప్రస్తుతం వెయ్యి మంది వరకు గల్లంతయ్యారు. వారిని రక్షించే చర్యలు కొనసాగుతున్నాయి. వారికి సంబంధించిన పూర్తి సమాచారం ఇంకా తెలియరాలేదు.

## తెలంగాణ వేదికగా 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్'

న్యూఢిల్లీ, ఆగస్టు 26: భారతదేశ యువ శక్తికి సరైన క్రీడా సదుపాయాలను, అవసరమైన ప్రోత్సాహాన్ని కల్పించి.. వారిలోని శక్తిసామర్థ్యాలకు పదునుపెట్టడంతోపాటుగా వారికి క్రీడా రంగంలో ఉజ్వలమైన భవిష్యత్తును అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తోంది. అందుకోసం గత 12 ఏళ్లుగా వివిధ కార్యక్రమాలతోపాటు పథకాలను తీసుకొచ్చింది.

మరో వైపు, ఆగస్టు 29న నేషనల్ స్పోర్ట్స్ డే ను పురస్కరించుకుని.. గురువారం (ఆగస్టు 27న).. దేశవ్యాప్తంగా 'ఖేల్ కీ బాత్, పీఎం కే సాథ్' పేరుతో ఖేలో ఇండియా సంవాద్ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా నిర్వహించనున్నారు. దేశ వ్యాప్తంగా ప్రతి జిల్లా నుంచి.. 2 కాలేజీల చొప్పున 1,500 లకు పైగా కాలేజీలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా క్రీడలు, ఫిట్‌నెస్‌తో పాటు యువత నేతృత్వంలో దేశ నిర్మాణానికి సంబంధించిన అంశాల మీద ప్రధాని మోదీ.. వర్చువల్‌గా ప్రసంగించడంతోపాటు క్రీడల పట్ల యువత ఆలోచనలు, ఆకాంక్షల గురించి వారితో మాట్లాడి తెలుసుకోనున్నారు.

'ఖేలో ఇండియా' కార్యక్రమం ద్వారా.. దేశంలోని యువ క్రీడాశక్తిని ప్రోత్సహించేందుకు దేశవ్యాప్తంగా.. 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్', 'ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్', 'ఖేలో ఇండియా పారా గేమ్స్', 'ఖేలో ఇండియా వింటర్ గేమ్స్', 'ఖేలో ఇండియా బీచ్ గేమ్స్', 'ఖేలో ఇండియా వాటర్ స్పోర్ట్స్ ఫెస్టివల్', 'ఖేలో ఇండియా ట్రైబల్ గేమ్స్' వంటి క్రీడా పోటీల నిర్వహణ ద్వారా క్రీడాకారులు తమలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను, తమలోని నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి ఒక వేదికను ఏర్పాటు చేసింది.

ఇప్పటి వరకు జరిగిన 24 ఎడిషన్ల 'ఖేలో ఇండియా ' పోటీల్లో దేశం నలుమూలల నుంచి 60 వేల మంది కిపైగా క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ పరంపరలో భాగంగా.. ఈ ఏడాది జరగనున్న 8వ ఎడిషన్ 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్' ను తెలంగాణలో నిర్వ హించేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్ వేదికగా ఈ పోటీలను నిర్వహించనున్నారు. ఈ ఎడిషన్‌లో మొత్తం 25 క్రీడల్లో పోటీలు నిర్వహించనున్నారు. ఆతిథ్య రాష్ట్రమైన తెలంగాణ.. ఒక స్థానిక క్రీడను ప్రతిపాదించవచ్చు. దీంతో పాటు గా మరో కొత్త క్రీడను కూడా ఈ ఈవెంట్లో ఆడించనున్నారు. ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా 6వేల మంది క్రీడాకారులు పాల్గొంటారని అంచనా.

ఈ 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్' నిర్వహణకోసం.. కేంద్ర ప్రభుత్వం రూ.22 కోట్లను విడుదల చేసింది. ఈ క్రీడా పోటీలను రాష్ట్ర ప్రభుత్వం, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా , నేషనల్ స్పోర్ట్స్ ఫెడరేషన్ , స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా , సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్, ఖేలో ఇండియా పథకం అడ్‌హక్ కమిటీ, స్టీరింగ్ కమిటీల సంయుక్త నిర్వహణలో నిర్వహించనున్నారు.

ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను తెలంగాణకు కేటాయించడం పట్ల.. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి, కేంద్ర యువజన సర్వీసులు, క్రీడా శాఖల మంత్రి మన్‌సుఖ్ మాండవీయకు ధన్యవాదాలు తెలియజేశారు. భారత యువతలో అపారమైన క్రీడా ప్రతిభ ఉందని, వారికి తగిన క్రీడా సదుపాయాలు కల్పించడం, అవసరమైన ప్రోత్సాహాన్ని అందించడం, ప్రతిభను వెలితీయడంలో గత ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం వహించాయని విమర్శించారు. స్పోర్ట్స్ బడ్జెట్‌ను పూర్తిగా నిర్లక్ష్యం చేశాయని ఆరోపించారు. 2014లో కేంద్రంలో మోదీ ప్రభుత్వం పగ్గాలు చేపట్టిన తర్వాత.. స్పోర్ట్స్ బడ్జెట్ కేటాయింపులు పెరిగాయని, ఖేలో ఇండియా వంటి పథకాల ద్వారా దేశంలోని మారుమూల ప్రాంతా లలో ఉన్న క్రీడా ప్రతిభకు సరైన ప్రోత్సాహం లభిస్తోందని పేర్కొన్నారు. 'ఖేలో ఇండియా' స్కీమ్‌లో భాగంగా.. తెలంగాణలో కూడా దాదాపు రూ.30 కోట్లతో క్రీడా సద ల కల్పన జరిగిందని, అందులో రూ.11.5 కోట్లతో ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో సింథటిక్ ట్రాక్, సింథటిక్ టెన్నిస్ కోర్ట్, మహిళల కోసం ప్రత్యేక స్విమ్మింగ్ పూల్ వంటి సౌకర్యాలను కల్పించారని, మరో రూ.18.5 కోట్లతో రాష్ట్రంలోని వివిధ పట్టణాలలో క్రీడా సదుపాయాలను కల్పించారని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

## కోడెల సంరక్షణలో నిర్లక్ష్యానికి తావులేదు

**ఐదు కోడెల మృతిపై విచారణ**
**తప్పిదం తేలితే చర్యలు**
**కొత్త గోశాలకు 40 ఎకరాలు**

రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 26:(నేటినిజం ప్రతినిధి): రాజన్న ఆలయానికి భక్తులు సమర్పించే కోడెల సంరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా చర్యలు



చేపడతామని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఆయన ఆలయ గోశాలను సందర్శించి, ఇటీవల ఐదు కోడెలు మృతి చెందిన ఘటనపై గోశాల నిర్వాహకులు, దేవాదాయ శాఖ అధికారులు, పశు వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. చిన్న వయసు కోడెలను దూర ప్రాంతాల నుంచి తీసుకు రావడం, వాతావరణ మార్పులు, వ్యాధుల కారణంగా ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. భక్తులు పాలు మరవని చిన్న కోడెలను సమర్పించకుండా, కనీసం ఏడాది వయసు వచ్చిన తర్వాత సమర్పించాలని సూచించారు. కొత్తగా వచ్చే కోడెలను 15 రోజులపాటు క్వారంటైన్‌లో ఉంచి, వయసు ఆధారంగా గ్రేడింగ్ చేయాలని అధికారులను ఆదేశించారు. చిన్న, పెద్ద కోడెలను వేర్వేరుగా ఉంచడంతో పాటు గాయాలు కాకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. వర్షాకాలంలో గోశాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఇటీవల జరిగిన కోడెల మృతిపై సమగ్ర విచారణ జరిపిస్తామని ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. మానవ తప్పిదం లేదా అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఘటన జరిగిందని తేలితే బాధ్యులపై చర్యలు తప్పవ న్నారు. 40 ఎకరాల్లో కొత్త గోశాల ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు వేములవాడలో ఆధునిక సదు పాయాల తో నూతన గోశాల నిర్మాణానికి 40 ఎకరాల స్థలాన్ని సేకరించి, క్యాబి నెట్ ఆమోదం పొందినట్లు తెలిపారు. త్వరలో నిర్మాణ పనులు చేపట్టి గోశా లను అందుబాటులోకి తీసుకొస్తామ న్నా రు. ప్రస్తుతం ఉన్న గోశాల సామర్థ్యాన్ని కూడా పెంచుతున్నట్లు పేర్కొన్నారు. భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం, దేవాదాయ, పశుసంవర్ధక శాఖల సమన్వయంతో కోడెల సంరక్షణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ, మున్సిపల్ చైర్మన్, అధికారులు, గోశాల నిర్వాహకులు పాల్గొన్నారు.

## కేశవాపూర్ గ్రామంలో వనమహోత్సవ కార్యక్రమం

ములుగు ఆగష్టు 25:(నేటినిజం ప్రతినిధి): ఈరోజు తెలంగాణా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రివర్యులు దనసరి. అనసూయ(సీతక్క) ఆదేశాల మేరకు, జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్ గారు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండి శ్రీనివాస్ సూచనల మేరకు వెంకటాపూర్ మండలంలోని పూర్ గ్రామంలో వనమహో కార్యక్రమం గ్రామసర్పంచ్ తోట భద్రయ్య అధ్వర్యంలో అధికారులతో కలిసి ఏర్పాటుచేసి మొక్కలు నాటి గ్రామ ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియచేశారు.

మొక్కలు నాటడం వలన ప్రకృతిని కాపాడేదిశగా అడుగులు వేస్తూ ముందుకు సాగుతున్నాం. ఈ సాగుతున్న కాలుష్య జీవితంలో మొక్కలు నాటి ఆక్సీజన్‌ను సమాజానికి



అందించేవిధంగా అందరూ కృషిచేయాలని అన్నారు. మొక్కలు నాటడం వలన పల్లెను సస్యశ్యామలంగా మార్చేవిధంగా కృషిచేస్తామని అన్నారు.

ఈ కార్యక్రమంలో భాగంగా

ఉప సర్పంచ్ రాజ్ కుమార్, అధికారులు ఎంపిడిఓ రాజు, వీఓ-శైలజ, ఏపిఓ-రాజు, గ్రామపంచాయతీ కార్యదర్శి-శ్రవణ్ కుమార్, గ్రామపంచాయతీ పాలకవర్గం, అంగన్వాడి టీచర్లు, ఆశావర్కర్లు, పాఠశాల ఉపాధ్యాయులు, కాంగ్రెస్ నాయకులు-చలం సేటు, తాడెం అశోక్ మరియు తదితర నాయకులు పాల్గొన్నారు

### చురక

సిద్ధాంతం రాజకీయ
చూపునిచ్చే గొప్ప శక్తి
అసలెవ్వరికున్నదీ
ఆచరించే దాని యుక్తి
నేతలు చెప్పిందే మాట
నడుచునదే రాజబాట
అందుకొరకే నిర్మాణం
అదుపుతప్పి కూలేకోట



-వేల్పుల నారాయణ
9440433475

### రాధశ్రీ రాగాలు

పాపముల కెదురొడ్డి
విరుగ గొట్టగ నడ్డి
పోరె రంగారెడ్డి
అనును రాధశ్రీ !!
ఆతనిది పలనాడు
ఈతనిది వెలనాడు
అను భావమును వీడు
మనును రాధశ్రీ !!



-రాధశ్రీ
సెల్:9494481210

## కర్ణాటకలోని భూతనాథ సరస్సులో 6 మృతదేహాల లభ్యం

న్యూఢిల్లీ, ఆగష్టు 26:కర్ణాటకలోని భూతనాథ సరస్సులో ఈ రోజు ఉదయం ఆరు మృతదేహాలు లభ్యమవడం కలకలం రేపింది. ఇంకా ఏవైనా మృతదేహాలు ఉన్నాయా అని పోలీసులు గాలిస్తున్నారు. ప్రముఖ చారిత్రక పట్టణమైన బాదామిలో గుహాలయాలకు కింది భాగంలో భూతనాథ సరస్సులో స్థానికులు ఈ రోజు(బుధవారం) ఆరు మృతదేహాలను గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. సరస్సులో ఇంకా ఏవైనా మృతదేహాలు ఉన్నాయేమోనని గాలింపు చర్యలు చేపట్టారు.

మృతదేహాలు లభ్యమైన సరస్సు ప్రముఖ పర్యటక ప్రాంతం అయినందున దీనిని వీక్షించేందుకు వచ్చి ప్రమాదవశాత్తు సరస్సులో పడి చనిపోయారా, ఏమైనా ఆత్మహత్యా కోణమా, ఎగువ నుంచి ఏమైనా కొట్టుకొచ్చాయా, వీరితోపాటు ఇంకెవరైనా ఉన్నారా, వీరంతా ఒకే కుటుంబానికి చెందిన వారా అనే దిశగా పోలీసులు దర్యాప్తు సాగిస్తున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## అమెరికాలో రోడ్డు ప్రమాదం.. ముగ్గురు తెలంగాణ యువకుల మృతి

న్యూఢిల్లీ, ఆగష్టు 26: అమెరికాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన యువకులు మృతిచెందారు. ఫ్లోరిడాలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు చనిపోయారు. మృతుల్లో నిజామాబాద్ జిల్లా నవీపేట్‌కు చెందిన రాహుల్ ఉన్నారు. రాహుల్ సుమారు మూడు నెలల క్రితమే అమెరికాకు వెళ్లాడు. ఉన్నత చదువులు లేదా ఉద్యోగం కోసం అమెరికా వెళ్లిన కొద్దికాలానికే రోడ్డు ప్రమాదంలో అతను ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఫ్లోరిడాలో ఈ ప్రమాదం ఎలా జరిగింది, ఏ వాహనంలో వారు ప్రయాణిస్తున్నారు, ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు ఏమిటనే దానిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. స్థానిక పోలీసులు ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు. రాహుల్ మృతితో నవీపేట్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.



నిర్వహణ
-కందుకూరి శ్రీరాములు

**తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ప్రతి వారం 'జూమ్'లో నిర్వహిస్తున్న "సోమవారం కవిసమ్మేళనం - కవివారం'లో కవులు పాల్గొని చదివిన కొన్నికవితలను నేటినిజం పాఠకుల కోసం..** -సంపాదకులు

### అడివి అక్షయ పాత్ర . . .

అడివి నించే కదా మెత్తని జీడి పండ్లు
గిరిజనులు శ్రమకోర్చి తెస్తుంద్రి
నోట్ల నమిలే దంతాలు లేకున్నా
తాత సైతం
తింటుండే అరిగించుకుంటుండే!.
జీడి పలుకులు కూడ
ఎంత కమ్మగా ఉంటుండెనో
చిరుతిండి అనుకుంటాం!
కాని ఇవన్నీ అడివి తల్లి ప్రసాదించిన
ఔషదాలే మరి !.
సాల పలుకుల మొర్రి పండ్లు
ఎంత కమ్మగా ఉంటుండేనో !
నల్లగున్నా
నోట్ల తియ్యగ కరిగిపోతుండే !.
అడివి తేనె ఎంత మధురమో !
ఇప్పుడన్నీ డుప్లికేట్ల తేనెలు !
సీసలల్లా షోకుల పేర్లు పెట్టుకోని
ప్రచారం చేసుకుంటా అస్తున్నె
ఇవన్నీ ఇప్పుడు అంగట్ల కల్తీ !.
అడివిలోని పచ్చని మోతుకాకులు
ఊర్లకచ్చి లగ్గంలా పంక్తి భోజనంలా వడ్డించిన
పెద్ద ఇస్తరౌతుండే!.
ఆనాడు అడివి అక్షయ పాత్ర
ఇప్పుడు క్షయమౌతున్నది !
దొంగల బారిన పడి రంపాల కింద
దుంగలై వ్యాపారంలో కొట్టుడు పోతున్నది !.
అడివిలోనే బాంబులు
అడివిలోనే తుపాకులు
అడివిలోనే యుద్ధ వ్యూహాలు
వర్తమానంలో అడివి అక్షయ పాత్ర కాదు
అడివి ఈనాడు కురుక్షేత్రం
అడివి ఆగమాగం !!.
ఇక అడివిని యాడినించి తెస్తం
అడివి ఇప్పుడు అమ్మమ్మ నాన్నమ్మ తాతలు
చెప్పే కథలలోనే సిత్రంగా ఇసిత్రంగా !!

– కందాళై రాఘవాచార్య
8790593638

### మితిమీరిన స్వేచ్ఛ

హద్దులుమీరి సరిహద్దులుదాటితే
స్వేచ్ఛకు విఘాదమే
వొంటికైన ఇంటికైన
జల్సాలు విలాసాలు
సరదాలు సరసాలు
శృతి మించితే విలాపమే.
నవ్వులు విరిసి విరియని పువ్వుల్లా
నడకలు గౌరవంగుండాలే
లేనివి తగిలించుకున్న
ఉన్నవి వదిలించుకున్న
సహజత్వం కోల్పోవడమే .
తోటోడు తొడకోసుకుండని
మనం మెడకోసుకుంటే
పోయేదే.. మిగిలేదుండదు
పులిని చూసి నక్క
వాత పెట్టుకున్నట్టే ఉంటది .
అన్ని భరించేటోళ్లు
ఏ యేషమేసిన చెల్లుబాటే
ఎల్లకాలం ఒకే రీతి గుండదు
ఋతువులు మారినట్టే
మనుషుల్లో మార్పుసహజం.
అందంగ కనిపించాలని
ఏ మనసైన కోరుకుంటది
లేనివి కల్పించుకున్న
కొంతకాలమే ననితెలిసిన
ఆశలపల్లకిలో యవ్వనం
ఊరేగాలనుకుంటది
అదనపు అలంకరణలతో.

-యరకల యాదయ్య.
9866468979.

### దేశమే మనకు రక్ష

దేశమే మనకు రక్షణ గొడుగు
యువత యుక్తితో వేయాలి అడుగు
దేశ ప్రతిష్టతకు ఎవరు వేయద్దు ముసుగు!.
యువతే దేశ భవితకు బలం
యువత భవిష్యత్తు కావద్దు అయోమయం
పాలన జన రంజకమై స్వర్ణ యుగం రావాలి
దుష్టంగాలను దుడుమాడి ధర్మం నిలపాలి!.
ఎలుకలు ఉన్నాయని ఇల్లు తగులబెట్టం
దేహం జబ్బు పడితే చికిత్స చేసుకుందాం
లోపాలను ఎలుగెత్తి చాటుదాం
వినకుంటే ఓటుతో బుద్ధి చెబుదాం!.
నిరసనలు నిర్మాణాత్మకంగా ఉండాలి
చట్ట సభల్లో అర్థవంతమైన చర్చలు జరగాలి
ప్రజావిశ్వాసం ఉన్నంతవరకే ఏ ప్రభుత్వమైనా!.
ప్రజాపక్షాలు సమస్యలు సమాధానాలతో ప్రతిబింబించాలి
తప్పు చేసిన వానికి తప్పక శిక్షలు ఉండాలి
యువత ఉజ్వల ఉన్నతే దేశ ఉన్నతి
దేశ గౌరవం నిలబెట్టడం కావాలి మనందరి నీతి!

-పట్లోళ్ల బక్కారెడ్డి
9705315250

### స్వేచ్ఛా గీతము


(వచన కవిత)

నా దేశాన్ని గూర్చి
పాడుతానొకమధురగీతాన్ని
జనగణమన, వందేమాతర
గీతాల నాలపిస్తూ,
ఎనబదివసంతాలస్వాతంత్ర్యదేశంలో,
ఎల్లలు లేని పురోగతి.
కలుషితబుద్ధిభావనల ననణచుచు
స్వదేశీ జ్ఞాన సంపదతో,
అచంచలమైన దృఢవిశ్వాసంతో,
అహంకారుల ఆత్మస్థైర్యాలను దెబ్బతీస్తూ,
శాంతి, సౌభాగ్యాలను స్వాగతిస్తూ,
ప్రపంచానికి మార్గదర్శిగా ముందుకేగుచు,
మూర్ఖుల చెండాడుతుంది.
ఉగ్రవాద ఆధిపత్యాల ధిక్కరిస్తూ,
ఊసరవెల్లుల్లా రంగులు మారే
స్వదేశీ రాజకీయాల తీరులు మారుస్తూ,
భారత జాతీయ వైభవాన్ని
చరిత్ర పుటల్లో తిరిగి వ్రాయిస్తున్నది
తిన్నింటి వాసాలను లెక్కిస్తూ,
పొరుగింటి పుల్లగూర రుచి అనే దుర్గుణాన్ని,
కూకటి వేళ్లతో తొలగిస్తే
నా దేశం రాణిస్తుందని పాడుతూ.
"నాదేశాన్ని"..... కోసం.


-నర్సింగోజు లక్ష్మయ్య
9866152371

నేటి నిజం
# సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com


# డా॥వి.శంకర్ నిశిత అస్తిత్వ సంకల్పం!




ప్రతులకు: జె. హిరణ్మయి
ఇ.నెం.4-15,
దేవివిహార్ కాలనీ,
దేవునిపల్లి, కామారెడ్డి
సెల్: 9440798954



- డా॥నాళేశ్వరం శంకరం
9440451960

డా॥ వి.శంకర్ రచించిన **'నిశిత'** సాహిత్య వాసాలు పుస్తకానికి డా॥ నాళేశ్వరం శంకరం రాసిన ముందుమాట.

**సమాజ జీవన అస్తిత్వ చైతన్యం నిండుగా ఉన్న కవి, పరిశోధకుడు, విమర్శకుడు, అధ్యాపకుడు, ఉద్యమకారుడు డా॥వి. శంకర్. సహజమైన సాహిత్య జీవనంలోకి అభ్యుదయ భావధారను, అస్తిత్వ సమర ధారను, పోరాటాల చలనధారను తనదైన జీవనదిలో కలగలుపుకున్న విలక్షణ రచనా శిల్పం ఆయన కున్నది. ఉవ్వెత్తున ఎగిసిన తెలంగాణ ఉద్యమంలో నేను సహితం అంటూ గొంతెత్తిన ముక్త కంఠం శంకర్.**

కోపం ఆవేశంగా కొన్ని మార్లు, ఆవేశమే కోపంగా పలు మార్లు గడిపిన తరువాతే ఒక దూరదృష్టి. ఒక సమన్వయ లక్ష్యం ఆయనలో పెనవేసుకుని సంఘటిత ఉద్యమ సాహిత్యకారుడిగా రూపాంతరం చెందాడనుకుంట. ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ఎం.ఏ.పూర్తి చేసి, నిజామాబాదు జిల్లా సాహిత్యంపై పరిశోధన చేశాడు. తెలుగు సహాయ ఆచార్యుడిగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో సాహిత్య సేవలు అందిస్తున్నాడు. వి.ఆర్.శర్మతో కలిసి **'గులేర్'** అనే కవితా సంపుటం వేసిన తరువాతే **'నడుస్తున్న తొవ్వపొంటి'** అని మరో కవితా సంపుటం వెలువరించాడు. నిజామాబాద్ జిల్లా కవిత్వం, కామారెడ్డి జిల్లా సాహిత్య చరిత్రను మన ముందుంచాడు. సమైక్యవాదుల 111 అబద్ధాలు, అపోహలు- అసలు నిజాలు అన్న ఆయన రచనావిష్కరణ సభలో కళ్ళారా ఆయన లోలోపలి విశ్వరూపం చూశాను. ఆయనకు ఎన్ని ఒత్తిడులు ఉన్నా వివిధ సెమినార్లలో ప్రసంగించిన పరిశోధన వ్యాసాలతో పాటు మరిన్ని నిబద్ధమైన వాటిని జతచేసి తెస్తున్న ఈ **'నిశిత'** వ్యాస సంపుటం నాకే కాదు సాహిత్యాభిమానులకు సైతం స్ఫూర్తి నిస్తుందన్న భావన చదివినప్పుడే కలిగింది.


డా॥వి.శంకర్ అటు ప్రాచీన సాహిత్యంలోను ఇటు ఆధునిక కవిత్వంలోను మంచి పట్టున్న విమర్శకుడు, సాహిత్య చరిత్రను నిశితంగా పరిశీలించి పరిశోధించి రాశాడు. మరువలేని మహాకవి పంపకవి రాసిన జినేంద్ర పురాణం లభ్యమైతే ఆనాటి మన భాష వెలుగు చూసేది. అన్నింటికీ మించి పంపకవి తెలుగులోనూ ఆదికవి గా చిరంజీవిగా నిలిచిపోయేవాడని శంకర్ అన్నది అక్షర సత్యం. ఇది మంచి విషయ సేకరణకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తుంది. భక్తి ఉద్యమకారుడు పాల్కురికి సోమన 64 శాస్త్రాలలో పండితుడైన వాడు. వర్ణ ఆధిక్యతను ధిక్కరించినవాడు. శివభక్తి ఉద్యమకా రుడై తిరుగుబాటు కవిగా చరిత్రకెక్కిన ఆయన సంఘసంస్కరణ భావవ్యాప్తిని విశ్లేషించిన వ్యాసం విశిష్టమైంది.

సాహిత్యం విషయంలో నిజామాబాదు విశిష్టమైన జిల్లా. పంప మహాకవితో పాటు బొమ్మలమ్మ గుట్ట శాసనంలోని కంద పద్యాలు రాసిన కవి జినవల్లభుడు ఇక్కడివాడే! జినవల్ల భుడు పంప మహాకవికి తమ్ముడు. మరో మహాకవి. కవిరాజు కొరవి గోపరాజు. 1470 ప్రాంతంలో నేటి నిజామాబాదులోని భీంగల్ ఆయన నివాసం. అతని సింహాసన ద్వాత్రింశికపై శంకర్ సమగ్రమైన వ్యాసం రాశాడు. నేటి కాలపు ప్రజల మనోభావాలను అధ్యయనం చేయడానికి ఇదొక బంగారు గనిలా ఉపయుక్తమౌతుంది.

ఇందులో వడ్ల వెంకటాచార్యులుపై రాసిన వ్యాసం నన్నెంతో ఆకట్టుకున్నది. స్థిరమైన అస్తిత్వ చైతన్యం శంకర్‌కు లభించింది. వారి నాన్న వల్లేనని ఈ వ్యాసం నాకు విప్పి చెప్పింది. అలాగే కొత్తపల్లి జయశంకర్‌పై రాసింది మనకెం తో స్ఫూర్తినిచ్చే వ్యాసం, సాంఘిక అస్తిత్వ చైతన్యం శంకర్ కు అలవడింది. జయశంకర్ సార్ నుంచేనని భావిసు న్నాను.

తెలుగు సాహిత్యంలో విశ్వకర్మ వృత్తులు- జీవన చిత్రణ, వర్తమాన తెలుగు కవిత్వం- పర్యావరణ చైతన్యం వ్యాసాలు సాహిత్య పాఠకునికి ఒక ఆలోచనను, సృజనాత్మక అనుభవాన్ని అందిస్తాయి. అలాగే అనర్ఘ జ్ఞానరత్నాలు- అమ్జద్ రుబాయిల వ్యాసంతో పాటు బతుకు లోతులు తెలిపే నరసింహారెడ్డి రుబాయిలు అనే మరో వ్యాసం ఈ పుస్తకానికి వన్నె తెచ్చే వ్యాసాలు. ఈ రెండు వ్యాసాలు చదువుకున్నప్పుడు దాశరథి కృష్ణమాచార్య రుబాయీ లపై ఒక వ్యాసం రాసి ఉంటే తెలంగాణ రుబాయీల జ్ఞాన నేత్రం మరింత దినకాంతిని ప్రసాదించేది. ఈ మొత్తం వ్యాసాలలో కుందుర్తి తెలంగాణ కావ్యంపై రాసిన దాంట్లో సహేతుకమైన విమర్శ కూడ ఉంది. అలాగే డా॥నందిని సిధారెడ్డి అనిమేష, ఉపద్రవం నుంచి ఉపశమనం దాకా! అన్న వ్యాసం కావ్య సమగ్రతకు, వ్యాస సమగ్రతకు సామ్యతకుదిరింది. నిర్దిష్ట కావ్య విమర్శ ఇది. సినారె విశ్వంభర తరువాత మనిషిని కేంద్రంగా చేసుకుని కవితా విలువలతో వెలువడిన గొప్ప కావ్యమిది. సంక్షోభ వేళ కొత్త తరం కవులకు దిశానిర్దేశం చేస్తుందన్న శంకర్ అంచనా నాకు నచ్చింది. కరోనా కాల ప్రతిబింబం అని మేష, ప్రజల మనోభావాలను వ్యక్తీకరించడమే కాదు చైతన్య పరిచింది కూడా. కాళోజీపై ఎన్నో వ్యాసాలు వచ్చాయి గానీ, సాహితీ సంస్థలతో ఆయనకున్న అనుబంధాలలో కొన్నింటిని మాత్రమే ఉటంకించారు. ఇంకా తూర్పు మల్లారెడ్డి సాహిత్య **'అన్వేషణ'** పై, డా॥ అట్టెం దత్తయ్య **'సారాంశం'**పై రాసినవి విశ్లేషణాత్మక వ్యాసాలు. నేను-నా పరిశోధన అన్న వ్యాసం ఆయన పనితనంపై ఆయనే వ్యక్తీకరించిన సంభాషణాత్మక వ్యాసం. చివరగా ఒక మాటతో ముగిస్తాను.

డా॥వి.శంకర్‌లోని బహుముఖీన పరిశీలనా వ్యక్తిత్వం **'నిశిత'** వ్యాసాలలో దర్శించగలిగాను. ఆయనలోని స్ఫూర్తినిచ్చే స్వభావం, నిబద్ధత, నిజాయితీ, దృక్పథం మన మనోభావాలకు, జిజ్ఞాసకు మార్గం చూపుతాయి. సరళత, సూటిదనం, స్పష్టత, ఆయన వ్యాస నిర్మాణ సామాగ్రిలో ఇమిడి ఉంది. అది సాహిత్య చరిత్రకు, పరిశోధనకు, విమర్శకు, విశ్లేషణకు, వ్యాఖ్యానానికి దోహద పడే విలుకాని విల్లంబులుగా దర్శనమిస్తాయి. ఆయనలోని నిర్భీతి ఈ సంపుటం వెన్నుపూస లో దాగి వుంది. ఆయన లాగే కల్తీలేనివే ఇవి. తెలంగాణ తాత్విక అస్తిత్వ తడితో రూపుదిద్దుకున్నవే. శంకర్ కుల వృత్తిలోంచి సాహిత్య వృత్తిలోకి పాదం మోపాడు. ఇదివ రకు కవిత్వాన్ని బాడిసెతో చెక్కినట్లు ఇప్పుడు కలం ఉలితో వస్తువుని తవ్వితీసాడు. ప్రాచీన కవులైన పంపకవి, పాల్కురికి, గోపరాజు వ్యాసాలు పరిశోధన స్వయంకృషికి ప్రతిబిం బాలైతే వట్టికోట, అమ్జద్ హైదరా బాదీ, కాళోజీ, కుందుర్తి, నందిని సిధారెడ్డి, ఏనుగు నరసింహారెడ్డి రచనా సుగంధాన్ని మన మనసునిండా నింపేటట్లు రాసాడు. ఎవరూ రాయని విధంగా వడ్ల వెంకటాచార్యుల గూర్చి, విశ్వకర్మ వృత్తులపై రాసినవి గొప్ప అస్తిత్వాన్ని సమకూరుస్తాయి. మల్లారెడ్డి, దత్తయ్యలోని సాహిత్య నైపుణ్యాన్ని చెప్పే సమీక్షకు మచ్చుతునకలు. కొత్తపల్లి జయశంకర్ ఉద్యమ స్ఫూర్తి ఆయనలో నిలువెత్తు ఉండబట్టే సజీవ జనజీవన వ్యాసమైంది. తెలంగాణ అస్తిత్వాన్ని నిలువెల్లా నింపుకున్న సాహిత్య కలం యోధుడు శంకర్ అని అభినందిస్తూ **'నిశిత'**కు స్వాగతం పలుకుతున్నాను. ●



# కవిత్వం..

కవిత్వం ఒక
చైతన్య వంతమైన
ప్రకాశ దీపం!.

కవి కలంతో
చెక్కెను సుందర
వందన శిల్పం!.

ఆ నల్లని
మబ్బు మబ్బు వదిలి
ఏ ఊరి చెరువు పంట
పండునో!

ఆ కవి
హృదయం పిండి
ఏ మనిషి మనస్సు
అలుగు పారునో !

కురిపించాలి
కవన వర్షం!
మొలిపించాలి
మాయమవుతున్న
సమాజంలో
మానవత పుష్పం!!



-నాగం సాయిలు
9490209037


# గుప్పెడు చిర్నవ్వు

భాషా శిరోజాలని
కార్పొరేట్ పేలు కొరికేస్తుంటే,
కాళ్ళూ చేతులూ
లావా కడియాలు అలంకరించుకుంటుంటే,
కొండ గర్భం లోని నివాసగృహాలు
కంగారూ పిల్లల్ని తన పొట్ట సంచిలో దాచినట్లు
అగుపిస్తుంటే
గుప్పెడు చిర్నవ్వు మాయమవుతుంది
గుండె గులాబీ రెక్కలు రాలిపోతున్నాయి !
నేల నాలుకని ఊడబెరికేస్తుంటే
రసరాజుల,
రుచిరాజుల పరిమళాలు పారిపోతున్నాయి!
శాన్లియార్ లాంటి పూల గుత్తులు
గాజు పెంకుల్లా భల్లున రాలిపోతున్నాయి !
గుప్పెడు చిర్నవ్వు మాయమవుతుంది
గుండె గులాబీ రెక్కలు రాలిపోతున్నాయి !
క్యాలెండర్ కూర్చినవారికి
సదా కృతజ్ఞతలు !
చారిత్రక, వైజ్ఞానిక, వేదాంత,ఆధ్యాత్మిక
జంత్రీలను
అమర్చిన అమరులకు నిర్విరామ జోహార్లు!
సమాధానాలు అన్నీ ఉన్నాయి
సమస్యలే సావధానపడడం లేదు
ఆరోగ్యానికి లెక్కలు గట్టే పాలన
పౌరుల ఇజ్జత్ కి
ఓ గొప్ప సవాల్ లాంటిది!
నిర్ధన ఏకాదశి ఉపవాసాలు
కాస్త ఉపశమనం కలిగిస్తాయేమో !
అరచేతులు అరచేతులు కలిసి
గులాబీల్లా పుష్పించి పరిమళిస్తే
కూసింత ఊపిరి దక్కుతుందేమో !
కాళ్ళూ కాళ్ళూ కలిసి
నాగళ్ళ చాల్లు లా నాట్యం చేస్తే
కోసరంత ఊరట దక్కేనేమో!
గుప్పెడు చిర్నవ్వు తో
గుండె పుష్పించేనేమో !



-ఒబ్బిని
9849558842

# అపురూప సాహిత్య నిధి



ప్రతులకు:.కె.జె.రమేష్
సెల్:9440111105



కె.జె.రమేష్ రచించిన **వినుకొండ సీమ సాహిత్య చరిత్ర** పుస్తకానికి పెనుగొండ లక్ష్మీనారాయణ రాసిన ముందుమాట.



-పెనుగొండ లక్ష్మీనారాయణ
94402 48778

నేను బి.ఏ.లో చరిత్ర విద్యార్థిని, చరిత్ర విద్యార్థిని అనే కాని నేను చదివిన చరిత్ర నాకు ఎన్నడూ వుపయోగపడలేదు. పాఠ్యాంశాల అన్నింటా దేశ విదేశాల చరిత్ర, యింకా యింకా మనకు ప్రాథమికంగా అవసరంలేని అనవసర విషయాలే బోధనాంశాలైనాయి. ఇలాంటి పనికిమాలిన చరిత్రను అందించటం పాలక వర్గాలు విద్యార్థులపై చేసిన కుట్ర. ఈ నాటికీ యిదే కొనసాగుతుందని మన చరిత్ర పాఠాలే సాక్ష్యం, అందునా విపరీతమైన వక్రీకరణలు.

మనం ప్రాథమికంగా తెలుసుకోవాల్సింది మన చరిత్ర అంటే మన గ్రామ చరిత్ర, తరువాత ప్రాంతీయ చరిత్ర, రాష్ట్ర చరిత్ర, దేశ చరిత్ర, ప్రపంచ చరిత్ర. 'చరిత్ర నిర్మాతలు ప్రజలే' అనే కోణం నుండి చరిత్రను అధ్యయనం చేయాలి. అవగాహన చేసుకోవాలి. ఇక్కడ ప్రజలు అంటే పాలితులు, పీడితులు. మన చరిత్ర అంతా పాలకులు, దోపిడీదారుల చుట్టూ తిరుగుతున్నదే. పాలకులు అందిస్తున్న ఇటువంటి చరిత్రను తిరస్కరించాలి. మన స్వంత చరిత్రను రాసుకోవాలి, పునర్ వ్యాఖ్యానించాలి, పునర్ మూల్యాంకనం చేయాలి. ఇది నేటి చరిత్రకారుల బాధ్యత, మహాకవి శ్రీశ్రీ 'దేశచరిత్రలు'ను కచ్చితంగా గుర్తు చేసుకోవాల్సిన సందర్భం యిది.

ఈ గీతం నా మాటలకు మరింత బలాన్ని **చేకూర్చుతుంది. అందులో కొన్ని చరణాలు :**

**"తాజ్‌మహల్ నిర్మాణానికి**
**రాళ్ళెత్తిన కూలీలెవ్వరు?...**
**ప్రభువెక్కిన పల్లకికాదోయ్,**
**అది మోసిన బోయీలెవ్వరు?..."** వర్గ దృక్పథంతో కష్టజీవుల పక్షాన నిలిచి చేసిన మహా రచన.

పౌరశాస్త్రాలు అవసరం లేదనే ఏలికలు వున్న ఈ పాడుకాలంలో ఇదంతా రాయటం తమ్ముడు రమేష్ రాసిన 'వినుకొండ సీమ సాహిత్య చరిత్ర' కోసం. నిజానికి ఏ చరిత్రకారులో చేయాల్సిన పనిని రమేష్ పవిత్ర బాధ్యతగా స్వీకరించి ఎంతో కష్టంతో ఇంత కృషి చేశాడు. ఈ పని రమేష్ చేయకపోతే... అది వూహించ లేని విషయం. రమేష్ జీవశాస్త్ర అధ్యాపకుడు, సాహిత్యంపై ఆసక్తికొద్దీ తెలుగులో ఎం.ఏ. చేశాడు. చరిత్ర విద్యార్థి, అధ్యాపకుడూ కాదు. ఎందుకంటే తనకూ తన శ్రీమతికి ఉపాధ్యాయ ఉద్యోగావకాశాలు కల్పించిన, తన కుటుంబ అభివృద్ధికి దోహదపడిన, తన వినుకొండ రుణం తీర్చుకోటానికే. ఇలా అందరూ ఆలోచిస్తే దేశమే ముందుకు సాగుతుంది. మరో విషయం ఏమిటంటే తన చుట్టూవున్న చరిత్ర కాలగర్భంలో కలిసిపో కుండా, విస్మృతిలోకి జారిపోకుండా వుండాలనే తపన, ఆరాటంతో చేసిన పని.

నేను 'వినుకొండ సీమ సాహిత్య చరిత్ర' శీర్షికతో ఎనిమిది పుటల చిన్న వ్యాసాన్ని 'మన వినుకొండ ప్రత్యేక సంచిక' కోసం 2012లో రాశాను. ఆ తర్వాత దానిని అక్టోబర్ 2014లో నా వ్యాససంపుటి 'విదిత'లో చేర్చాను. ఆ వ్యాసం నాకేమీ సంతృప్తి కల్పించలేదు. మళ్ళీ తిరగరాశాను. పదహారు పుటలైంది. దానిని 'వినుకొండ సీమ సాహిత్య చరిత్ర' (కొద్దిలో కొద్దిగా) అన్నాను. 58 అధ్యాయాలు 516 పుటలు కలిగిన నా రచన 'గుంటూరు సీమ సాహిత్య చరిత్ర'లో (ఫిబ్రవరి - 2026)లో చేర్చాను. ఈ పుస్తకం యిప్పటికి మూడు ముద్రణలు పొందింది. వినుకొండ సీమవాసిగా, నా జన్మభూమిపై ప్రేమ, గౌరవంతో రాసిన వ్యాసమది. నా గురువుగారు, అరసానికి నన్ను పరిచయంచేసి నా ఉన్నతికి కారకులైన పులుపుల వెంకట శివయ్యగారి స్మృతికి 'వినుకొండ సీమ సాహిత్య చరిత్ర'ను సగౌరవంగా సమర్పించాను. ఈ వ్యాసం తన ఈ గ్రంథానికి ప్రేరణ అనటం రమేష్ నిజాయితీకి నిదర్శనం. నేను రాసిన చిన్న వ్యాసం ఒక పరిశోధనా గ్రంథానికి ప్రేరణ అవటాన్ని నేను గర్వపడుతున్నాను. నా సాహిత్య కృషికి ప్రయోజనం లభించినట్లు పరవశిస్తున్నాను.

రమేష్ అందిస్తున్న ఈ విశిష్ట గ్రంథం మరికొందరికి ప్రేరణ అవుతుందని ఆశిస్తున్నాను. ఇప్పటికే కొన్ని గ్రామాలు, ప్రాంతాల చరిత్రలు వెలువడ్డాయి. అయితే అవి తక్కువ. ముఖ్యంగా తెలుగునాట అన్ని ప్రాంతాలకు చెందిన కవితా, కథాసంకలనాలు వచ్చాయి, వస్తున్నాయి. చరిత్రలోని ఖాళీలను సాహిత్యం పూర్తి చేస్తుందనే సత్యాన్ని ఈ పుస్తకాలు నిరూపిస్తున్నాయి.

వినుకొండ అనగానే కేవలం కొద్దిమంది సాహితీవేత్తలు మాత్రమే లోకానికి తెలుసు. ముఖ్యంగా గుర్రం జాషువా గారి గురించి. ఈ పుస్తకంలో అన్ని సాహిత్య ప్రక్రియలలో కృషిచేసిన దాదాపు డెబ్బై మంది వినుకొండసీమ సాహితీ వేత్తలను పరిచయం చేయటం విశేషం. ఈ పుస్తకంలో కొందరి గురించి తెలియకపోవటం వలన చేర్చలేకపోయి వుండవచ్చును. పుస్తకం చదివిన పాఠకులు, మేధావులు గుర్తు చేస్తే, సమాచారం అందిస్తే తరువాత ముద్రణలో చేర్చే అవకాశముంది.

రమేష్ ఈ కృషిని ఇంట్లో కూర్చొని చేయలేదు; ఎన్నో పుస్తకాలను తిరగేశాడు, క్షేత్ర ప్రర్యటనలు చేశాడు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకున్నాడు. ఆ ఫలితమే ఈ జ్ఞాననిధి. 'ఇతిహాసపు చీకటికోణం అట్టడుగున పడి కాన్పించని' సాహిత్య చరిత్రను అందించి ఒక గొప్ప బాధ్యతను రమేష్ నిర్వర్తించాడు. రమేష్‌కు అభినందనలు. ముఖ్యంగా వినుకొండ సీమ అతని కృషిని గుర్తించి గౌరవిస్తుందని ఆశిస్తున్నాను.

రమేష్ తండ్రి జేమ్స్‌గారు క్రైస్తవ మత రచనలను చేసి తెలుగునాట ప్రసిద్ధిచెందారు. రమేష్‌లో తండ్రి స్ఫూర్తి వుంది. క్రైస్తవ సాహిత్యాన్ని 'మధురమాల' అనే రూపంలో అందించాడు. కవితలు రాశాడు. నానీలు అందించాడు. వాటిని సంపుటాలుగా ప్రచురించాడు. ఆకాశవాణి శ్రోతలకు, దూరదర్శన ప్రేక్షకులకు రమేష్ సుపరిచితుడు.


రమేష్ అందిస్తున్న ఈ సాహిత్య చరిత్ర రచనలో సహకరించిన అతని కుటుంబ సభ్యులకు, ఈ మహా ప్రయత్నంలో తోడ్పడిన సహృదయు లందరికీ మప్పిదాలు. ఈ మంచి పుస్తకంలో నన్నూ పరిచయం చేసిన రమేష్‌కు కృతజ్ఞతలు.

చిరంజీవి కొర్రపాటి జోజి రమేష్ చేసిన, చిరకాలం నిలిచిపోయే కృషిని ఈ మంచి మాటలతో మెచ్చు కుంటున్నాను.

శుభాకాంక్షలు, శుభాశీస్సులు అందజేస్తూ శెలవు. ●

# జనశ్రీ గీతాలు 'ఆత్మీయానురాగాలు'

పుస్తక సమీక్ష




ప్రతులకు: జనశ్రీ
జనార్ధన్ కుడికాల
ఇ.నెం.7-1-47, ఫ్లాట్ 402
రత్నదీప్ రెసిడెన్సీ, బాలసముద్రం
హన్మకొండ, తెలంగాణ-506 001
సెల్: 9703275050

'ఆత్మీయాను రాగాలు, జనశ్రీ గీతాలు- 3, బంధుత్వాల గీతాలు- జనశ్రీ- కుడికాల జనార్ధన్- ఇదీ అట్టమీద రచయిత రాసిన నాలుగు మాటలు. ఆ మూల ప్రత్యేకంగా 'గీతాలు' అనిపెట్టారు. క్రింది బొమ్మ మీద, భార్యా, భర్త, కుమార్తె, ఇద్దరు కుమారులు. అమ్మ ప్రక్కన అమ్మాయి వుంది. అమ్మా నాన్న ఒకరి చేతులొకరు పట్టుకుని వున్నారు. నాన్న పెద్ద కొడుకు వెనుక చేయివేస్తే, ఆ కుమారుడు నాన్న వెనుక చేయివేసాడు. అన్నతమ్ముడి వెనుక చేయివేసాడు (మరో చెయ్యిని). తమ్ముడు అన్న వెనుక చేయి వేసాడు. అందరూ ఆనందంగా వున్నారు. అమ్మా నాన్నా మాట్లాడుకుంటూ వుంటే, ఆడపిల్ల శ్రద్ధగా వింటున్నది. మొగపిల్లలు ఎక్కడో చూస్తున్నారు. ఈ అట్ట మీది బొమ్మ చూస్తే చాలు అర్థమవుతుంది మనకు జనార్ధాన్‌గారు ఈ పుస్తకం లోపల ఏమి చెప్పబోతున్నరో! అట్ట వెనుక అమ్మా నాన్నల రక్తబంధం, అన్నదమ్ముల రాగ బంధం అంటూ ఒక చక్కటి కవిత లాంటి సుర సుమ సుగంధాలు పేర్చికూర్చారు. ఇక 60వ పేజీలో అంటే చివరి పేజీలో, ఆత్మీయ అనురాగాల కలుపుగోలు తనంతో మేదిలే కొడుకులు, కోడళ్ళు, మనవళ్ళ సంక్షిప్త పరిచయం వుంది. చిన్న మనవడు కుడికాల రాహుల్‌ను పరిచయం చేస్తూ- విద్యార్థతలు: 'ఇప్పుడిప్పుడే మాటలు నేర్చుకుంటున్నాడు' అది రాయడం నాకు గొప్ప ఇంట్రడెక్షన్‌గా (పరిచయం) అనిపించింది. ఈ అట్టమీది బొమ్మను జనార్ధన్ గారి చిన్నబ్బాయి కుడికాల వంశీదర్ డిజైన్ చేశారు. ఈ పుస్తకాన్ని వారి ఇద్దరు కొడుకులు, ఇద్దరు కోడళ్ళు, ముగ్గురు మనవళ్లకు అంకితం ఇచ్చారు. ప్రేమ పూర్వకంగానూ సతీ సమేతంగానూ ఇది వారికి ఆత్మ సంతృప్తిని ఇచ్చిందని రాసుకొచ్చారు. వారు అన్నట్లుగానే కొడుకులకు తండ్రి అంకితం చేసిన సందర్భాలు చాలా అరుదు. ఇందులోని 50 గీతాలూ అన్నదమ్ముల అనుబంధాలు, విద్యార్థి జీవితం, అమ్మానాన్నల లోకంపోకడ, బంధుత్వాల అల్లిక, తరతరాల అంతరాలగూర్చి వున్నాయని రచయిత స్వయంగా ముందు మాటలు **'నా మాట నా నోట ఈ చోట'** అంటజూూా కొత్తదనంతో ముచ్చటించారు. ఈ గీతాలను జనార్ధన్‌గారు వివిధ కవి సమ్మేళనాళ్ళలో గానాలాపన చేసినవే. మొదటి గీతం, **'వినవోయి బాలకా వినవోయి'** అన్న ప్రబోధగీతం వుంది. తల్లితండ్రి మాట వినవోయి, సత్యనిష్టలూ, ధర్మకృత్యాలు మంచిముత్యాలు, రాగబంధాలు మా గోమేధికాలు అంటూ రానున్న రోజు నీదోయి అంటూ మనం కూడా హాయిగా పాడుకునేలా వుంది. అన్నదమ్ముల రాగబంధంలో అది అమ్మానాన్నల రక్తబంధం ఏనాటికైనా విడిపోనిది అంటూ ఎన్నో మంచి సలహాలు ఇచ్చారు. **'ఎదిగిపో యువకుడా, ఎదిగిపోరా'** అన్న రచనలో చదువుతున్న కొలదీ సంస్కారం పెరగాలి. మూఢత్వం మూర్ఖత్వం మటుమాయం కావాలి. పాలకడవ జీవితం చేసుకో ప్రభావితం, మనసుతెల్ల కాగితం, రాసుకో సుభాషితం అంటారు. నాన్నంటే నీ ధైర్యం స్థైర్యం, తల్లీతండ్రీ గురువే దైవం అంటూ కవితలున్నాయి. జన్మనిచ్చిన తల్లిదండ్రులను ఎల్లవేళలా స్మరించమన్నారు. అమ్మంటే అమృతవల్లిరా అమ్మంటే కల్పవల్లిరా, అమ్మ జగతికి స్ఫూర్తి అంటూ రాసారు మరో కవితలో. అమ్మ, నాన్న, కుటుంబం చాలా కవితల్లో వస్తువుగా వుంది. పసిపిల్లల పట్ల ప్రేమాభిమానం, పండు ముదుసళ్ళపట్ల దయాగుణం, అదే భారతీయ సంస్కార జీవితం, అదే సమాజ పురోగతికి చేయూత అన్న మాటలు జనాలను ప్రభావితం చేస్తాయి. చివర్లో మనిషి బ్రతుకు నిత్యంపోరాటం అన్న రచనలో పోరాటం, ఆరాటం, ఉబలాటం, ముఖ్య కారణాలుగా అభివర్ణించారు. జీవన విధానంలో అడుగడుగునా సామాన్యుడు ఎదుర్కొంటున్న సమస్యలను ఏకరువు పెట్టారు. ఈ విశ్వాన్ని నడిపేది ధర్మం, జబ్బులు ఎవరికి ఊరికే రావు, అహింసా పరమ ధర్మం, మాతృత్వం వంటిదే దాతృత్వం,ఆనంద భాష్పాలు కన్నీటి పుష్పాలు, మనిషికి సాధ్యం కానిది ఏది? నువ్వు నేను కలిసిపోతే జనం జనం, మనిషి విలువ తెలిపేదే వ్యక్తిత్వం, వంటి రచనల్లో ఏముందో ఈ మకుటాలు చూసేమీరు ఊహించవచ్చును.

వీరు ముందుగానే చెప్పినట్లుగా ఈ గీతాలను వారి పుత్రులు వారి జీవిత సత్యాలను సంగ్రహించి అందిండంలోని ఆంతర్యం, వారంతా నిజాలను తెల్సుకుని ఆదర్శవం తంగా నడుచుకుం టారని ఆశించడమే.

అయితే ఈ గీతాలు లోకానికి కూడా ఒక గొప్ప సందేశాలను అందించాయి. ఎంతో గొప్పగానూ, జన సమ్మతంగానూ, పాడుకునే విధంగానూ వున్నాయి. జనార్ధన్‌గారు మీ ఆశయం నెరవేరినట్లే మరి.



- డా॥ పులివర్తి కృష్ణమూర్తి
సెల్:9949092761

# ఆరుద్ర సినీ కవనం-అందాల బృందావనం!

ప్రతిభ, సృజనాత్మకత, చదివించగలిగే గుణం ఉన్న రచయిత కలకాలం పాఠకుల గుండెల్లో నిలుస్తాడు. చరిత్రలో తనకంటూ ఒక అధ్యాయాన్ని లిఖించగలుగతాడు.. అలాంటి వారే ఆరుద్ర.

లోకంలోని వెలుగూనీడా లోతులు చెబుతూ రేపటి రూపును లోపలి కళ్ళకు నేడే చూపేవి వీరి సినీ గీతాలు.. అలాంటి ఆ గీతాలలో ఈ రుద్రుడు ఎలా చెలరేగిపోయాడో చెప్పడమే ఈ వ్యాస ఉద్దేశ్యం.

ప్రేక్షకుల, శ్రోతల ఆత్మానందం కోసం, సన్నివేశానుగుణంగా రాసేది సినిమాపాట. అయినా దానికి సాహిత్య సౌరభం, శాశ్వతత్వం కల్పించగలిగే సినీ రచయితల్లో గొప్పగా చెప్పుకోదగిన వారు, ఎంతగానో మెచ్చుకోదగినవారు శ్రీ (భాగవతుల శంకర శాస్త్రి) ఆరుద్రగారు.

మనసు పాటలకు ఆత్రేయ, వీణపాటలకు దాశరథి, జానపద పాటలకు కొసరాజు, కవితా, భాషాపద ప్రయోగాలకు మల్లాది, భక్తి రస గీతాలకు సముద్రాల ఎలా పేరు పొందారో ...అలాగే అంత్య ప్రాస లతో గీతాలు రాయడం లో అందేవేసిన చేయిగా ఆరుద్ర గారు వన్నెకెక్కారు."మంచి రచన చదివాక బాగా భోం చేసి నట్టు ఉండాలి కొంచెం బాధపడాలి జ్వరం రావాలి ..." ఇవి వారి మాటలు ...వారి పాటలు వింటుంటే శ్రోతకు ఈ అనుభవాలు అన్నీ కలుగుతాయి. లోకం లోని వెలుగూనీడా లోతులు చెబుతూ రేపటి రూపును లోపలి కళ్ళకు నేడే చూపేవి వీరి సినీ గీతాలు..అలాంటి ఆ గీతాలలో ఈ రుద్రుడు ఎలా చెలరేగిపోయాడో చెప్పడమే ఈ వ్యాస ఉద్దేశ్యం. పదండి అలా వారి సినీ కవనమనే అందాల బృందావనం లో విహరిద్దాం.

కవిత కోసం పుట్టి క్రాంతి కోసం కలం పట్టిన ఆరుద్ర 1925, ఆగస్టు 31న విశాఖపట్నంలో జన్మించాడు. వీరు అభ్యుదయకవి, పండితుడు, పరిశోధకుడు, నాటక కర్త, విమర్శకుడు. ఇతని భార్య కె.రామలక్ష్మి తెలుగు రచయిత్రి. ఆరుద్ర రచనలు విలక్షణమైనది.వారు సాహిత్యంలో అనేక ప్రక్రియలు చేపట్టారు.

మధ్యతరగతి జీవనం, నగర జీవన చిత్రణమైన సినీవాలి, ప్రతి పదరమణీయాలైన కూనలమ్మ పదాలు, ఇంటింటి పద్యాలు, గురజాడ గురు పీఠం, మన వేమన, వేమన వేదం వంటి -విమర్శక వ్యాసాలు, గాయాలు గేయాలు, పైలా పచ్చీసు, శుద్ధ మధ్యాక్కరాలు, సాలభంజికలు, రాముడికి సీత ఏమవుతుంది, గుడిలో సెక్స్, చదరంగం.. వంటి రచనలు.. నాటి తెలంగాణలో రజాకార్ల దుశ్చర్యలకు స్పందించి రాసిన "త్వమేవాహం' ( ఈకావ్యం చదివినాక ..ఇక నేనురాయవలసిన పనిలేదు" అని శ్రీశ్రీ గారు అన్నారట) .. అన్నిటికీమించి వారి తెలుగు భాషాసాహిత్య సేవలో మకుటాయమానమైనది 13 సంపుటాల సమగ్ర ఆంధ్రసాహిత్యం ...ఇవీ వారు తెలుగు సాహిత్యంలో మిగిల్చిన ఆణి ముత్యాలు.

## సినీ గీత/మాటల రచయితగా ప్రస్థానం

1949లో బీదల పాట్లు అన్న చిత్రంలో .. **"ఓ చిలుకరాజా నీ పెళ్లెప్పుడు"** అనే గీతంతో మొదలైన వారి సినీ గీతప్రయాణం **'వారెక్కాల్సిన సినీ ట్రైన్ జీవిత కాలం** లేటు' కాకుండడం తో నాలుగు వేల పాటలతో వందలాది సినిమాలకు సంభాషణలు రాయడం తో ముగిసింది. వీరి సినీ గీతాలు **'ఆరుద్ర సినీ గీతాలు'** అన్న పేరుతో ప్రచురితమయ్యాయి.

1953లో ప్రముఖ హిందీ నటుడు రాజ్‌కపూర్ సినిమా **'ఆహ్'**కి తెలుగు అనువాద చిత్రంగా వచ్చిన 'ప్రేమలేఖలకు మాటలు, పాటలు రాసే అవకాశం దొరికింది. **"రాజాకీ ఆయేగి బారాత్ రంగోలి హోగి రాత్"** పాటను 'పందిట్లో పెళ్ళవుతున్నాది, కనువిందవుతున్నాది'గా, **"యే షామ్‌కి తన్హాయియా? ఐసె మై తేరాఘమ్"** పాటను **"ఏకాంతమూ సాయంత్రమూ ఎద నీకై వేగేనూ'** అంటూ అర్థవంతంగా పాటలు రాసిపేరు తెచ్చుకున్నాడు. .అదే విధంగా 'మురిపించే మువ్వలు' చిత్రం లో **"సింగార వేలనే దేవా"** పాటను వీరు **"నీ లీల పాడేద దేవా... మనవి ఆలించ వేడెద దేవా"**గా రాశాడు.దానితో వీరు వెనక్కి తిరిగి చూసుకోలేదు.

## నాస్తికుడు రాసిన భక్తి గీతాలు-

మౌలికంగా సామాజిక స్పృహ, సాంఘిక నిబద్ధత కలిగిన ఈ అభ్యుదయ రచయిత నాస్తికుడు. కానీ వారి భక్తి గీతాలు, భక్త జనహృదయాల్లో దైవం పట్ల అనితర విశ్వాసం నెలకొలిపే భక్తి జ్ఞాన దీప కళికలు.

**చెంచులక్ష్మి**- నారదుడు పాడే **"కరుణాలవాలా, ఇది నీకు లీలా... అంతయును వింత, పొగడగ నేనెంత".**. ఇక్కడ కూడా .. వారి అంత్య ప్రాసల జోరు కనిపిస్తుంది.

**పరసతులను చెరబట్టే అంధుడు**- ఆ సురలోకం పాలించే ఇంద్రుడు; పదవి మీద ఆశచేత ప్రభువాయెను పశువు-పాపం తననేమి చేసె కడుపులోని శిశువు' ..

**సీతారాముల కల్యాణం** -వెడలెను కోదండపాణి..

**సంపూర్ణ రామాయణం**-చూసినవారిదె వైభోగంః..

**అందాలరాముడు**-పలుకే బంగారమాయెరా కోదండ రామా..

**శ్రీ రామాంజనేయ యుద్ధం** -మేలుకో శ్రీరామ.. మేలుకో రఘురామ మరియు శ్రీయుతమౌ శ్రీరామ నామం జీవామృతసారం..

**గోరింటాకు**- రాయినైనా కాకపోతిని రామ పాదం సోకగా ..

**మీనా**- శ్రీరామ నామాలు శతకోటి.. అన్న రామ గీతాలే కాకుండా ....

**శ్రీవేంకటేశ్వర వైభవం** - 'శ్రీ వేంకటాచలవాసా.. నినుసేవింతుమో శ్రీనివాసా..

**బాలభారతం**-నారాయణ నీ లీలా నవరసభరితం..

**యశోద కృష్ణ**-నోముపండింది మానోము పండింది కృష్ణా

**భక్త కన్నప్ప**-శ్రీకాళహస్తీశ్వరా హరహరం.. కరుణించి నను బ్రోవరా

**ముద్దుబిడ్డ**-జయ మంగళ గౌరీ దేవి.. దయ చూడుము చల్లని తల్లీ

**నోము**- అందరి దైవము నీవన్నా ఆశలు తీర్చన్నా నాగుల చవితి నాగన్నా పూజలు గొనుమన్నా...వంటి విభిన్న మైన భక్తి గీతాలు రచించారు. కవి అన్నాక అన్నీ రకాల రచనలుచేయాలీ. ఇక సినీ కవికి తప్పేది అసలే లేదు.

## మసక మసక చీకటిలో పాటలు

అప్పుడు..ఇపుడూ ఎపుడూ సినిమా అనేది వ్యాపార కళ. నిర్మాతకు కాసులు గలగల కావాలంటే తెరపై గ్లాసులు గలగలలాడాలి. తక్కువ దుస్తులతో అంగాంగ విన్యాసాలతో యువతులు అర్ధనగ్న, లేదా కురచైన వస్త్రధారణలతో పాటలు పాడాలి. అందులో కళ,పాత్ర చిత్రణ, ఔచిత్యం పేరున అశ్లీలత, అసభ్యత ఉండాలి. వి పైకి కనిపించకూడదు. సెన్సార్ వారికి కనిపించి నట్లుగా ఉండకూడదు. అదేమిటో మనకు కనిపించి నట్లు గా వారికి కనిపించదు.

అయితే ఆరుద్ర వంటి వారు క్లబ్బు పాటలు,నేటి భాషలో ఐటం సాంగ్స్ రాసినా అంతోయింతో సాహిత్యం గౌరవం ఆ పాటలు కలిగిఉండేవి. అలాంటి



ఆగస్టు 31
ఆరుద్ర గారి జయంతి ..

పాల్లో బాగా చెప్పుకోదగినది

**దేవుడుచేసిన మనుషులు**-మసక మసక చీకటిలో మల్లెతోట వెనకాలమాపటెళ కలుసుకో ..

**రౌడీలకు రౌడీలు**- తీస్కో కోకాకోలా.. ఏస్కో రమ్ము సారా'..

**చిట్టి తమ్ముడు**-ఏస్కో నా రాజా ఏస్కోస్కో, వక్కేస్కో, ఆపైన చూస్కో ..

**శ్రీమంతుడు** -మొదటి పెగ్గులో మజా.. వేడి ముద్దులో నిషా...

**అదృష్టవంతుడు** -ముమ్ము..ముమ్ము..ముద్దంటే చేదా ఇపుడా ఉద్దేశం లేదా..

ఈ పాట అప్పట్లో సంచనం ..కల్చరల్ షాక్ కు గురిచేసిన గీతం.

**జరిగిన కథ**-లౌలౌ లౌమీ నెఅజాణా-నౌ నౌ కిస్ మీ చినదానా-సుఖములు సొగసులు అందించే ఖజానా..

**ఆరాధన**- ఆడదాని ఓరచూపుతో జగాన ఓడిపోని ధీరుడెవ్వరో...

**బుద్ధిమంతుడు**- ఇచ్చుటలో ఉన్న హాయిూ వేరెచ్చటనూ లేనే లేదని... మైకపు గీతాలలో వేదాంతం కూడా కలగలిపి రాసినది. నిజానికి ఈపాటలు ఆధునిక నగరాల్లోని సామాజిక జీవనం లోనుంచి పుట్టుకొచ్చినవ.విభిన్న సాంస్కృతిక రీతులకు తగినట్లుగా, కాలానుగుణంగా మారుతున్న సామాజిక నేపథ్యాన్ని, సాంస్కృతిక విలువలను తెలియజేసేవి.

## స్థల పురాణ గీతాల స్పెషలిస్టు

సినిమాలలో కథ,సన్నివేశానుగుణంగా యేవైన స్థలాల గొప్ప తనంవర్ణించాల్సి వచ్చినపుడు దర్శక నిర్మాతలు ఆరుద్ర వైపు చూసేవారు. వారురాసిన ...

**ఎంఎల్ఏ** -'ఇదేనండి ఇదేనండి భాగ్యనగరం? మూడుకోట్ల ఆంధ్రులకు ముఖ్య పట్టణం'- హైదారాబాద్ గురించి..

**బాలరాజు కథ**- మహాబలిపురం మహాబలిపురం -తమిళనాడులో గల మహాబలిపురం గురించి ... ఈపాటలో వచ్చే ఒక అభివ్యక్తి... మరలా వారి వేదంలా ఘోషించే గోదావరి పాటలో ..కొట్టుకొని పోయే కొన్ని కోటి లింగాలు ....వీరేశ లింగమొకడు మిగిలెను చాలు.. అన్న చోట కనిపిస్తుంది.

**ఆంధ్ర కేసరి** - వేదంలా ప్రవహించే గోదావరి ...గోదావరి,రాజమండ్రి గురించి ..

ఈ పాటలు చక్కగాగైడ్ వ్యవహరిస్తూ మన చేయి పట్టుకొని ఆ ప్రదేశాల గొప్పతనంచెబుతాయి.

### సంస్కృతీ సంప్రదాయ గీతాలు

వారికి అవకాశంవచ్చినప్పుడల్లా తెలుగు సంస్కృతీ ,సంప్రదాయాలను వర్ణిస్తూకలకాలం నిలిచిపోయే చక్కని గీతాలు రాశారు.

**పెళ్ళిపుస్తకం** -శ్రీరస్తూ శుభమస్తూ ?.శ్రీకారం చుట్టుకుంది ..శ్రీకారం చుట్టుకుంది పెళ్ళిపుస్తకం..

**రక్తసంబంధం**- బంగారు బొమ్మరావేమీ.. పండిట్లో పెళ్లి జరిగేనే ...

**సాక్షి** - అత్త కడుపు చల్లగా..అమ్మకడుపు చల్లగా చల్లనీ ఐరేనికి మొక్కరా..సన్నికల్లు మీద కాలు తొక్కరా ..వంటి పాటలు మన వివాహ క్రతువును వర్ణించే పాటలు.అందులో శ్రీరస్తూ..శుభమస్తు పాటఅయితే పెళ్ళికిథీమ్ సాంగ్ గా మారినది.

**ముత్యాలముగ్గు** -ఆరనైదో తనము ఏ చేతనుండు.. అరుగులలికేవారి అరచేతనుండు.. తీరైన సంపదా ఎవరింటనుండు.. దినదినము ముగ్గున్న లోగిళ్ళ నుండూ అంటూ.. **'ముత్యామంతా పసుపు ముఖమంతా చాయా'** అన్న పాటలో తెలుగు లోగిళ్లు,విశ్వాసాలను వర్ణిస్తాడు.

**ఇంటింటి రామాయణం** -ఇంటింటి రామాయణం వింతైనా ప్రేమాయణం కలిసుంటేసల్లా పం విడిపోతే కల్లోలం ...పాటలో సంసార జీవన మహత్యం కలిసి ఉంటే కలదు సుఖం అని యువతకు సందేశాన్ని ఇస్తాడు.

### ప్రణయ గీతాలు

గడ్డం సరసానికి అడ్డమా అంటూ చమత్కరించే ఆరుద్రలో ఒక మంచిప్రణయ, శృంగార కవి ఉన్నాడు..

వారి పాటల్లో ప్రేయసీ ప్రియుల ప్రణయం సున్నిత శృంగార మధురంగా ఆహ్లాద భరితంగా, భావస్ఫోరకంగా ఉంటూ శ్రోతలను, ప్రేక్షకులకు మంచి అనుభూతిని మిగులుస్తాయి.

**ఈడూ-జోడూ**-ఇదేమి లాహిరి ఇదేమి గారడి -ఎడారిలోన పూలు పూచి ఎంత సందడి..

**ముత్యాలముగ్గు** - ఏదో ఏదో అన్నది ఈ మసక వెలుతురు-గూటి పడవలోనున్నది కొత్త పెళ్లి కూతురు...

**ఉయ్యాల**-జంపాల -కొండగాలి తిరిగింది? గుండె ఊసులాడిందిగోదావరి పడవలాగా కోరిక చెలేరగింది...

**బంది పోటు** -ఊహలు గుసగుసలాడే..నా హృదయం ఊగిసలాడే....

**వీరాభిమన్యు**- రంభా ఊర్వశి తలదన్నె రమణీ లలామ ఎవరీమె...మరియు..అదిగో నవలోకం వెలసే మనకోసం ...

**ప్రేమలేఖలు** -ఇది తీయని వెన్నెల రేయి మది వెన్నెల కన్నా హాయి నా ఊహల జాబిలి రేకలు కురిపించెను ప్రేమలేఖలు..

**తూర్పు వెళ్ళే రైలు** -చుట్టూ చెంగావి చీర కట్టాలే చిలకమ్మ -బొట్టూ కాటుక పెట్టి నే కట్టే పాటను చుట్టి..

**వయసు పిలిచింది**- ఇలాగే ఇలాగే సరాగమాడితే వయారము ఈ యవ్వనమూయలూగితే... లాంటి పాటలు నాటికి నేటికీ రసమయ హృదయ ప్రేక్షకుల హృదయ శ్రుంగార జలధిలో ఓలలాడుతూనే ఉన్నాయి.

## అంత్యప్రాసా ముద్రుడు ..

**ఇంటిగౌరవం**-చింతపువ్వు ఎరుపు చిలక ముక్కు ఎరుపు- చేయి చేయి కలుపు లేత వలపు తెలుపు- మల్లెమొగ్గ తెలుపు మంచిమనసు తెలుపు- చేయి చేయి కలుపు నిండు వలపు నిలుపు-

**ఉయ్యాల**- జంపాలహో "ఓ పోయే పోయే చిన దానా, నీ తీయని మనసు నాదేనా"

**స్నేహం**- నవ్వు వచ్చిందంటే కిల కిల ఏడుపొచ్చిందంటే వల వల-గోదారి పాడింది గల గల దాని మీద నీరెండ మిల మిల మిల .. ఈ పాటలో వచ్చే ప్రతీచరణంలో ప్రతీ వాక్యం ఒక కొటేషన్‌లా ఉంటుంది.

కొత్తమతం పుచ్చుకుంటే కోర్కెలెక్కువా.. చేతకా నమ్మకే చేష్టలెక్కువ.. చెల్లరూపాయికే గీతలెక్కువ..

తమసొమ్ము సోమవారం ఒంటి పొద్దులుం టారు... మంది సొమ్ము మంగళవారం ముప్పొద్దు లాతింటారు.

వీరి భక్తి పాటల్లో కూడా అంత్య ప్రాసల విన్యాసం కనబడుతుంది.

ఉయ్యాల- జంపాల-లో రాముడి పైన పాట- "తండ్రి మాటకై పదవుల త్యాగమే జేసెను.. తన తమ్ముని బాసకై తాను బాధపొందెను- అనుభవించదగిన వయసు అడవిపాలు జేసెను..అడుగు పెట్టినంతమేర ఆర్య భూమి జేసెను-ధర్మ పత్ని చెరబాపగ దనుజుని దునుమాడెను.. ధర్మము కాపాడుటకా సతినే విడనాడెను- అంటూ ప్రతి చరణం చివర 'అందాల రాముడు, ఇందీవర శ్యాముడు, ఇనకులాబ్ది సోముడు అందువలన దేముడు- అంటూ పల్లవి సాగుతుంది.. ఇదో అద్భుత ప్రక్రియ-మాస్టారు పిల్లకు చెప్పినట్లు ఉంటుంది. వీరి అంత్యప్రాసావిన్యాసాలు సహజం.ఆపాత మధురం..పండిత పామర గాన గానయోగ్యం..

## సరదాగీతాలు

అత్తా ఒకింటి కోడలే- **"పైలాపైలా పచ్చీసు, పరువంలోనే లేడీసు.. మగాళ్లతోటి సమానమంటూ ఎక్కారండీ సైకిల్స్"**

**ముగ్గురమ్మాయిలు-ఆకాశం నుండి నాకోసం వచ్చావా.. పొంగే అందాల మిఠాయి పొట్లం తెచ్చావా....నువు పక్కపక్కగా వుంటే నే స్వర్గం దున్నేస్తా ....నువు కనపడకుండా పోతే బాల్చీ తన్నేస్తా.. నీ జడ పిన్ను నా తలరాతకు పెన్ను .... నీ సిగపువ్వు .. అదేవిటమ్మా.. ఆ బుజబుజరేకుల లవ్వు ..నీ చిలిపి బిడియం అమృతంలో వండిన వడియం....నీ పెదవు లు రెండు నా ముక్కుకు దొండపండ్లు..ఓహో రోజా తెగ ఉక్కిరిబిక్కిరి ఔతున్నాడీ రాజా..నీ లేడికళ్ళు నాకు వేస్తాయి సంకెళ్ళు... నీ లేత ఒళ్ళు చూస్తే నాకు ఎక్కిళ్ళు- నీకు నేను ముద్దులబందీ నన్ను పెట్టకే ఇబ్బంది.... నీకంతా చెలగాటం నాకెంతో ఇరకాటం...**

ఈపాటలో అంత్య ప్రాసలు సరదాగా ఉండడమే కాకుండా హాస్య రస స్ఫోరకంగా ఉంటాయి. ...

(వచ్చావా..తెచ్చావా, దున్నేస్తా..తన్నేస్తా , పువ్వు.. లవ్వు, ఎక్కిళ్ళు..సంకెళ్లు,బందీ... ఇబ్బంది బుల్ బుల్ -ట్రబుల్ )

ఇది తెలుగు సినిమా పాటలలో చక్కని హాస్య గీతంగా కూడా చెప్పవచ్చు.

**స్నేహం**- ఎగరేసిన గాలిపటాలు దొంగాటా దాగుడుమూతలు-గట్టు మీద పిచ్చుక గూళ్లు కాలువలో కాగితం పడవలు గోలీలు గోటీబిళ్ల ఓడిపోతే పెట్టిన డిల్లా- చిన్ననాటి ఆనవాళ్లు స్నేహంలో మైలురాళ్లు.

పడగొట్టిన మామిడికాయ పొట్లంలో ఉప్పూకారం-తీర్థంలో కొన్న బూరా.. కాయ్ రాజా కాయ్..

దసరాలో పువ్వుల బాణం దీపావళి బాణసంచా.. చిన్నప్పటి ఆనందాలు చివురించిన మందారాలు

నులివెచ్చని భోగిమంట మోగించిన గుడిలో గంట ... వడపప్పు పానకాలు పంచుకొన్న కొబ్బరి ముక్కా

గోడ మీద రాసిన రాతలు జీడితో వేసిన బొమ్మలు.. చిరిగిపోని జ్ఞాపకాలు చిత్త స్వాతి వానజల్లులు.

ఈ పాట తరువాత వచ్చిన "గుర్తుకొస్తునాయి" వంటి పాటలకు బాలశిక్ష వంటివి.

మా ఇంటి మహాలక్ష్మి-కోర్టు భాషా పదజాలంతో రాసిన గీతం **-"నువ్వంటేనే నాకు మోజు.. అలా రాసిస్తానే దస్తావేజు.. మేను లాంటి నా కన్నులు అమీనై.. జామీను లేని నా మదిని జప్తు చేసినై"** అంటూ సాగుతుంది.

**ఆరాధన**- ఇంగ్లీషులోన మ్యారేజి, హిందీలో అర్థము షాదీ, ఏ భాషలో ఏమన్ననూ మన తెలుగులోన పెళ్లి'

**లక్ష్మి నివాసం**-సోడా సోడా ఆంధ్రా సోడా గోలీ సోడా జిల్ జిల్ సోడా..సోడాతాగు తెలుగోడా చల్లని సోడా దీనీ మహిమా చెప్పలేడు దేవుడు కూడా

**దేవాంతకుడు**- గో గో గో గో గొంగూర..జె జె జె జె జైఆంధ్ర.. వంటి పాటలు అన్నీ సరదా పాటలే.

### టీజింగ్ సాంగ్స్

**నేనంటే నేనే** -గుంతలకిడి గుంతలకిడి గుంతలకిడి గుమ్మ

దేవుడు సేసిన మనుషులు.. దోర వయసు చిన్నది -భలే జోరుగున్నది

## సాహిత్య రుద్రుడు .

వారు అలా వచ్చి ఇలా పోయే పాటలే కాక గొప్ప సాహిత్య, భాషా సుగంధాలు వెదజల్లే గీతాలు కాదారాశారు.

**ఉయ్యాల జంపాల**-కొండ గాలి తిరిగింది గుండె ఊసులాడింది గోదావరి తరగ లాగ కోరిక చెలరేగింది... పాటలో ప్రతీ వాక్యం రసాత్మకంగా సాగుతుంది.. 'పట్టపగలు సిరివెన్నెల భరతనాట్యమా డింది' వంటి వినూత్న పదప్రయోగాలతోను; 'పడుచుదనం అందానికి తాంబూలమిచ్చింది' 'నాగమల్లి పూలతో నల్లని జడ నవ్వింది' లాంటి హృద్యమైన అభివ్యక్తితో ... ప్రాప్తమున్న తీరానికి పడవ సాగిపోయింది" అనే వేదాంత ధోరణితో ముగుస్తుంది.

ఈ పాట తెలుగు ప్రణయ గీతాలలో మొదటి పదిలో ఉంటుంది అనడం లో సందేహంలేదు.

ఆనంద నిలయం- పదిమందిలో పాట పాడినా అది అంకితమెవరో ఒకరికి అన్న పాటలో భావం మధుర భక్తి భరితమై ఉంటుంది.

**భక్తపోతన**- 'నాగరాజ కన్య, జగదేక మాన్య కమనీయ దివ్యకల్యాణ ధన్య' అనే పాటలో శ్రీనాథుడి నుడికారాలు కనిపిస్తాయి.

బాల భారతం- మానవుడే మహనీయుడు శక్తియుతుడు యుక్తి పరుడు మానవుడే మహనీయుడు మంచిని తలపెట్టిన మనిషికద్దు లేదులే ప్రేరణ దైవానిదైనా సాధించును నరుడే..

ఈ పాటలో...వారు నాస్తికులైనా... ప్రేరణ దైవానిదైనా సాధించును నరుడే..అన్న మాట వాడాడు.

## దేశభక్తి

దేశభక్తిని ప్రేరేపించేవీ, చారిత్రాత్మకమైనవీ అయిన ఎన్నో పాటలు ఆయన కలం నుంచి జాలువారాయి.

అల్లూరి సీతారామరాజు-రగిలిందీ విప్లవాగ్ని ఈ రోజు ఆ అగ్ని పేరె అల్లూరి సీతారామరాజు... అనే టైటిల్ సాంగ్ లోని "కన్నెగంటి హనుమంతు వెన్నులోని బాకు కత్తి గట్టి సాగమంది కడ విజయం వరకు" అన్నవాక్యం వీరరస స్ఫోరకంగా సాగగా మరియు "వందేమాతరమంటూ నినదించిన బంగాళం, స్వరాజ్యమ్మె జన్మహక్కు అని చాటిన మహరాష్ట్రం; హింసకు ప్రతిహింస అన్న వీరభూమి పాంచాలం; అన్నిటికీ నెలవాయెను ఆంధ్రవీర హృదయం రామరాజు హృదయం..అన్న వాక్యాలు నాటి దేశభక్తులకు వివిధ ప్రాంతాలలో జరిగిన జాతీయోద్యమాలు సీతారామ రాజుకు ఎలా ప్రేరణ అయ్యాయో తెలుపుతుంది.

**పవిత్రబంధం**-గాంధి పుట్టిన దేశమా ఇది నెహ్రు కోరిన సంఘమా ఇది సామ్యవాదం రామరాజ్యం సంభవించే కాలమా ఇది-నాటి, నేటి సామాజిక పరిస్థితులను, స్వార్థ పూరితప్రపంచాన్ని కవితా రూపంలో వర్ణించాడు. ఇదే పాటలో

ఉప్పొంగే నదుల జీవజలాలు ఉప్పు సముద్రం పాలు -అన్న వాక్యంద్వారా యువశక్తి ఎలానిర్వీర్యమవుతుందో తెలిపాడు.

**ఊరికి మొనగాడు** -కదలిరండి మనుషులైతే కదలిరండి మమత వుంటే ఉప్పెనగా ఉమ్మడిగా బలి కోరిన దీనుల కోసం బతకలేని చావలేని ప్రాణుల కోసం ...వంటి గీతాలలో సామాజిక స్పృహ ,సమాజంలో మన బాధ్యతను తెలియజేశాడు.

## కరుణారుద్రుడు

**ముద్దుబిడ్డ**- చూడాలని ఉంది అమ్మా చూడాలని ఉంది..వంటి పాటల ద్వారా సెంటిమెంట్‌తో గుండెలను పిండే పాటలు రాయగలడుఅని నిరూపించుకున్నాడు .

## సంవాద గీతాలు

ధర్మసందేహాల్నీ, వాదసంవాదాల్నీ, జీవిత సత్యాలను, తత్వసారాలను తేట తేట తెలుగులో పాటలుగా పలికించగల గొప్ప కవి ఆరుద్ర.

బాలరాజు కథ- అడిగానని అనుకోవద్దు, చెప్పకుండ దాటెయ్యద్దు ఏమిటీ రహస్యం స్వామీ ఏమిటీ విచిత్రం.. అన్న పాట ప్రశ్నలు సమాధానాల రూపంలో సంవాదరూపంలో ఉంటుంది.వారి హేతువాద ధోరణిని తెలియ జేస్తుంది.

పాటల్లో మాటలు.. మాటలు కావు ..ముత్యాల మూటలు-వారి పాటల్లో కొన్ని వాక్యాలు..ఒకకావ్యంతో సమా నం..వారి పాటల్లోని మాటలు నినాదాలుగా సూక్తు లుగా ఉంటాయి.

**లేతమనసులు**- పిల్లలూ దేవుడూ చల్లని వారే కల్ల కపట మెరుగనీకరుణామయులే ..

**సిపాయి చిన్నయ్య** -నాజన్మ భూమి ఎంత అందమైన దేశం నా ఇల్లుఅందులోన కమ్మని ప్రదేశము..

మంచి కుటుంబం -మనసే అందాల బృందావనం

**మీనా** - పెళ్ళంటే నూరేళ్ళ పంట అది పండాలి కోరుకున్న వాడి ఇంట

**బుద్ధి మంతుడు**- ప్రియురాలి వలపుల కన్నా నులివెచ్చనిదేది లేదు ...ఇచ్చుటలో ఉన్న హాయి వేరెచ్చటనూ లేనే లేదు

**అందాల రాముడు**- ఎదగడానికెందుకురా తొందరా ఎదర బతుకంతా చిందర వందరా

**దేవదాసు** - కల చెదిరింది కథ మారింది కన్నీరే ఇక మిగిలింది... జీవితం ఏమిటీ వెలుతురూ చీకటీ ..వెలుతురంతా చీకటైతే అందులోనే సుఖమున్నదీ

తరానికో వందకవులు తయారవుతారు. ఎపుడూ వందలోను మందలోనూ మిగిలేది ఒక్కడే అంటారు ఆరుద్రగారు. నిజమే వందలో మిగిలిన ఒక్కరి లాంటి వారే వీరు. ఎవరో శ్రీశ్రీ ఉత్తరం రాస్తూ ఆరుద్రను సంబో ధిస్తూ...తమ శిష్య రత్నం అన్నాడట .... దానికి శ్రీశ్రీ నా శిష్యుడంటే ఆయన ఒప్పుకోడు ..రత్నమంటేనేను ఒప్పుకోను అన్నాడట. వారు ఒప్పుకోకున్నా వారు కవిరత్నమే. ఆదుర్తిగారికి ఆత్రేయలా .. విశ్వ నాథ్ గారికి వేటూరిలా ...బాపూగారికి ఆరుద్ర.. వీరు ఇతరుల సినిమాలలో ఎన్ని గొప్పగీతాలు రాసి నా ..వీరిలా ఆలోచించే దర్శకులతో పనిచేయడం వలన వీరి ప్రతిభ, అభివ్యక్తి, విద్వత్తు మరింత బాసించింది. శోభిల్లింది.బాపురమణలుటీవీకి తీసిన భాగవత కథల్లో సుం దరకాండను సుదీర్ఘగీ తంగా రచించారు ఆరుద్ర. ఇదే ఆరుద్ర చిట్టచివరి రచన. నాస్తికులైన ఆరుద్రగారి తమ రచనా వ్యాసం గం సుందరాకాండతో ముగియడం రామచంద్రుని నిర్ణయం కావచ్చు. ప్రతిభ, సృజనాత్మకత, చదివించ గలిగే గుణం ఉన్న రచయిత కలకాలం పాఠకుల గుండెల్లో నిలుస్తాడు. చరిత్రలో తనకంటూ ఒక అధ్యాయాన్ని లిఖిం చగలుగతాడు.. అలాంటి వారే ఆరుద్ర.



-కె.కౌండిన్య తిలక్
8790920745

---

## కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న

### 'బుధవారం బాద్షా' పోటీ ఫలితాలు





అడ్మిన్: రమాదేవి కులకర్ణి
8985613123

నిర్వహణ: శ్రీమతి సత్య నీలిమ

### మేలుకో ఓ యువతా!

కలల కోటలు కూలుతున్న వేళ,
కనుపాపల్లో చీకట్లు ముసురుతున్న వేళ,
దేశానికి వెన్నెముక అనుకున్న యువశక్తి,
నేడు నిరాశ నింగిలో దిక్కుతోచక నిలిచింది!.
స్మార్ట్‌ఫోన్ తెరల వెనుక సత్యం మరుస్తూ,
లైకుల లోకంలో నిజమైన బంధాలు వీడుతూ,
ప్రాణాల కంటే పబ్జీలే మిన్న అనుకుంటూ,
వర్చువల్ వలలో చిక్కి విలవిలలాడుతోంది!.
మత్తు పదార్థాల మాయలో పడి,
క్షణికానందం కోసం జీవితాన్ని తగలేస్తూ,
డ్రగ్స్, మద్యం రంగుల లోకంలో,
కన్నవారి కన్నీళ్లను కానలేకపోతోంది!.
లక్ష్యాల బాటను పక్కనబెట్టి,
అడ్డదారుల్లో పయనించడమే వేగమనుకుంటూ,
అపరాధాల ఊబిలో కూరుకుపోతూ,
తన బంగారు భవితను బూడిద చేసుకుంటోంది!.
మేలుకో ఓ యువతా! ఇకనైనా కళ్లు తెరువు,
నువ్వు పతనమైతే దేశ భవిష్యత్తే శూన్యం.
సృజనాత్మకతను ఆయుధంగా మలచుకో,
ప్రమాదపు అంచు నుండి
ప్రగతి వైపు అడుగులేయి!.
సంకల్ప బలంతో సవాళ్లను ఎదురించు,
నిరాశను తరిమి ఆశావహంగా జీవించు,
నీ చేతుల్లోనే ఉంది రేపటి నవసమాజం,
సన్మార్గంలో నడిచి సాధించు నీ విజయం!.

-కానుకొలను లక్ష్మీసీత

### పొగ చూరిన నేల

వాడేసెయ్-పారేసెయ్,
చేతులుదులిపేసేయ్
రేపు ఏమైతే...నాకేంటీ..??
ఇప్పుడు...ఈ క్షణం జీవించేయ్
అనే క్షణిక సుఖాల జీవనం
భవిష్యత్తును
ప్రమాదపు అంచులలో
ముంచేసిన, నవ నాగరిక
సమాజం..!!.
ప్లాస్టిక్ అనే పిశాచిని పుట్టించి
నోటి నుంచి కాటి వరకు నడిచే
పెంపుడు కుక్కలా పెంచి
పోషిస్తే
అది విశ్వాసం చూపించినట్టే
చూపించి
మాయతో తాను
నేలతల్లి గర్భంలో చేరిపోయి
అసలు రంగు బయటపెట్టి..
తన కాలుష్యపు
కోరల కరాళనృత్యం చేసి
పచ్చ గడ్డిని కూడా
పుట్టించలేని బంజరు
పొగచూరిన నేలగా
మార్చేసింది..
మారణహోమం
సృష్టించింది..!!.
పంట సిరులనందించే
భూమినే మరుభూమిగా
మార్చడం కాకుండా
ఆఖరికి పాలిచ్చే
తల్లుల పాలలో కూడా
చడీచప్పుడు లేకుండా
చాపకింద నీరులా
ఎప్పుడు చేరుతుందో
కూడా
తెలియని
అయోమయ పరిస్థితికి
చేర్చింది
మొదటికే ముప్పై
కూచుంది..!!.
ఇకనైనా మేలుకుందాం
అవనితల్లిని ప్రమాదపు
అంచులనుండి
రక్షించేందుకు
నడుంకడుదాం
ప్లాస్టిక్ సంచుల వాడకం
పూర్తిగా మానేసి
పొగచూరిన నేలకు
హరితకళల
లేపనాలద్ది, రత్నగర్భగా
తీర్చిదిద్ది
భావితరాల భవితలకు
భరోసాగా నిలుద్దాం..!!.

-సావిత్రి రంజోల్కర్

### ప్రమాదపు అంచుల్లో

నేటి సమాజం ప్రమాదపు అంచుల్లో వుంది.....
మనిషి మానవత్వం...
మంచితనం...మరిచిపోతున్నాడు.
మని ప్లస్ షీ యే మనిషి అనుకుంటున్నాడు.
భౌతిక ప్రపంచపు మరుపులకు లొంగిపోతున్నాడు...
తినే బియ్యంలో రాళ్ళు కలిపేవాడొకడైతే..
కల్తీ మందులు తయారుచేసేవాడొకడు...
దేశ రహస్యాలను అమ్మే వాడొకడైతే,
తల్లి చంపిన తనయుడొకడు...
స్వార్థ పిశాచానికి నీరాజనమిచ్చి...
నైతిక విలువలకు తిలోదకాలిచ్చి...
సమాజాన్ని విధ్వంసం చేస్తున్నారు నేడు...
మన దేశం,సమాజంలో
నైతిక విలువలు అడుగంటుతున్నాయి.
జననీ,జన్మభూమిశ్చ
స్వర్గాదపిగరీరసీ అని
మన దేశాన్ని, సమాజాన్ని మనమే
తీర్చిదిద్దుకోవాలీ...
మానవత్వానికి వెలుగులు ఇవ్వాలీ...
నేను,నా స్థానంలో మేము,
మనము అని ఆలోచించాలీ...
ప్రమాదపు అంచుల్లో వున్న మానవత్వానికి
ప్రాణం పొయ్యాలీ.

-ఎం.వి.చంద్రశేఖరరావు
భాగ్యనగరము



ప్రముఖ నటుడు నిర్మాత ఈ నారాయణరావుకు జీవిత సాఫల్య పురస్కారం అందజేస్తున్న ఎమ్మెల్సీ ఎస్. మధుసూదనచారి వంశీ రామరాజు, నాగరాజు తదితరులు

# కృషి, పట్టుదల ఉంటే అగ్రస్థానం

హైదరాబాద్, జూన్ 26:(నేటినిజం ప్రతినిధి) కృషి, పట్టుదల ఉంటే వారి వారి రంగాల్లో అగ్రస్థానానికి ఎదుగుతారని, దీనికి ప్రముఖ నటుడు చిరంజీవే నిదర్శనమని ఎమ్మెల్సీ ఎస్. మధుసూదనచారి అన్నారు. సినీ రంగంలో స్వయంకృషితో ఆయన మెగాస్టార్‌గా నిలిచారని కొనియాడారు. కళారవిందం సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం త్యాగరాయ గానసభలో చిరంజీవి నటించిన సినిమాల్లోని 71 పాటలను ప్రముఖ గాయకులు రాంకుమార్, రవి, శంకర్, శ్యామ్, గోపాల్, శ్యామ్‌సుందర్ శ్రీరాణీ ప్రణిత, హరిణి, శోభ ఆలపించారు. సభలో పాల్గొన్న మధుసూదనాచారి ఈ సందర్భంగా ప్రముఖ నటుడు నిర్మాత ఈ నారాయణరావుకు జీవిత సాఫల్య పురస్కారం బహూకరించి మాట్లాడారు. వంశీ రామరాజు మాట్లాడుతూ చిరంజీవి తొలిసారిగా వంశీ బర్కిలీ అవార్డును అందుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# అన్నదానానికి నిలువెత్తు రూపం డొక్కా సీతమ్మ



సభలో ప్రసంగిస్తున్న శాసనమండలి ప్రతిపక్ష నేత, ఎం.ఎల్.సీ. సిరికొండ మధుసూధనాచారి. వేదికపై జయసూర్య, కళా జనార్ధనమూర్తి తదితరులు

హైదరాబాద్, జూన్ 26:(నేటినిజం ప్రతినిధి) తెలుగు నేలపై అన్నదానానికి నిలువెత్తు రూపంగా నిలిచి, తన ఇంటికి వచ్చిన ప్రతి ఒక్కరి ఆకలి తీర్చిన మహనీయురాలు డొక్కా సీతమ్మ అని శాసనమండలి ప్రతిపక్ష నేత, ఎం.ఎల్.సీ. సిరికొండ మధుసూధనాచారి అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభ, తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో గానసభలోని కళా సుబ్బారావు కళా వేదికలో ఎందరో మహానుభావులు మధుర స్మృతుల పరంపరలో భాగంగా నిత్య అన్నదాత, అన్నపూర్ణ డొక్కా సీతమ్మ యాదిలో కార్యక్రమాన్ని నిర్వహించారు. గానసభ అధ్యక్షుడు కళా వి.ఎస్. జనార్ధనమూర్తి, అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సిరికొండ మధుసూదనాచారి ముఖ్య అతిథిగా విచ్చేసి డొక్కా సీతమ్మ చిత్ర పటానికి ముందు జ్యోతి ప్రకాశనం చేసి నివాళులు అర్పించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ డొక్కా సీతమ్మ సమాజసేవలో, మానవతా విలువలను కాపాడటంలో చూపిన అంకితభావం, సేవా స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని కొనియాడారు. ఆకలితో వచ్చిన వారికి భోజనం పెట్టడాన్ని జీవిత ధ్యేయంగా చేసుకున్న ఆమె సేవలు చిరస్మరణీయమని ఆయన అన్నారు.

సాంస్కృతిక సంగాన్ని, చారిత్రక విశేషాలను ప్రతిబింబించేలా ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్న త్యాగరాయ గానసభ నిర్వహాకులను సిరికొండ మధుసూదనాచారి అభినందించారు.

ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు జయసూర్య, గాయని శారద, గానసభ సంయుక్త కార్యదర్శి తాళ్లపల్లి చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.






## సప్త పదులు

ప్రక్రియా సృజనకర్త: సుధామ



పకపకలు
వికవికలు

పలుగురిలలో చేస్తే
ఎదుర్కోవాలి
తప్పక
లుకలుకలు

-హైమ. కందుకూరి
లండన్

సర్దుబాటు
దిద్దుబాటు

రైతులకు
ధరలు
ఎప్పుడు ఇవ్వాలి
గిట్టుబాటు

-కుప్పిలి రాజేశ్వరి
విశాఖపట్నం

మితము
స్థితము

ఆరోగ్యంగా ఉండాలంటే
అప్పుడప్పుడు
ఉపవాసమే
హితము.

-కాకర్ల చెంచలరావు
ఒంగోలు.

కలం
గళం

ప్రతిదానికీ
స్పందించ వద్దు,
నిశ్శబ్దమే
బలం.

-కె.ఎం. కె. మూర్తి
సికింద్రాబాద్

# సోషల్ మీడియా దరిద్రం



– పి.చంద్రశేఖర అజాద్
92465 73575




ఈ వారం మకుటం చూసి మీలో కొంత మంది సంబరపడిపోతారని మాకు తెలుసు. ఇకనుండి మీ పిల్లల మీద, ముఖ్యంగా మేంగో బృందం మీద వరుసగా దాడులు మొదలవుతాయని. దాడులు అంటే పసందైన బూతులు కదా.

ఇదివరకు మా మిస్టర్ క్లీన్ గారూ, మా తాతగారు చెప్పేవారు. వారి చిన్నతనంలో చదువుకోనివారు, ఎంగిలి బీడీలు తాగేవారు, పశువుల్ని మేపుకుని బతికేవారు, పనీ పాట లేకుండా ఊరి మధ్యలో రావి చెట్టు దగ్గర, పేకాటలు ఆడుతూ, వచ్చేపోయే కూలి వాళ్ళ మీద బూతులు మాట్లాడేవారంట. అది వారికి తప్పు అనిపించేది కాదు. అసలు మన భాష అది, మన సంస్కృతి అది అని వాళ్ళు వాదించేవారు కాదు. మాకు తెలిసింది ఈ భాష. అలవాటయిపోయింది అని మాత్రం అనేవారంట.

అలాంటి బాపతు అంటే చదువుకోని వారు, కూలి పనులు చేసుకునేవారు కాదు సుమా - కాస్త గొంతుండి, దరిద్రపు తెలివితేటలు నేర్చుకుని, మనం నాలుగు రాళ్ళు సంపాదించాలనుకున్నవారు రాజకీయాల్లోకి వచ్చి నాయకులయిపోయారంట. అక్కడి నుండి, బూతు రాజ్యాంగం ఇచ్చిన హక్కు - ఇదే మా సంస్కృతి అని సిద్ధాంతాలు చెప్పటం మొదలుపెట్టారంట. అలాంటివారంతా రాజకీయాల్లోనే కాదు అన్ని రంగాల్లోకి ప్రవేశించారంట.

ఇప్పుడు బూతు కామన్.

అది వాడుక భాషలోనా? గ్రాంధికమా? ఆంగ్లమా? మరో ప్రాంతీయ, విశ్వజనీన భాషా అనేది పెద్ద పరిశీనాత్మక విషయమంట. ముందుముందు డాక్టరేట్లు ఇచ్చేది ఈ బూతుల పంచాంగాలకేనని మా 'క్లీన్' గారి కొసవిరుపు.

సోషల్ మీడియా వచ్చాక ఇది ఎల్లలు దాటింది. భూమండలాన్ని దాటింది. అంతరిక్షంలోకి వెళ్ళింది. ఇప్పుడు గాలిలో, నీటిలో, పర్వతాల్లో, నదుల్లో, లోయల్లో ఒక్క మాటలో చెప్పాలంటే ప్రకృతిని బూతుమయం చేశారు. మనకు సర్వ దరిద్రాలు వున్నాయి. అందులో ప్రధానమైనది - ఈ సోషల్ మీడియా. ఈ దరిద్రం ఇప్పట్లో పోదు. అది కన్‌ఫామ్. మరి దీని తీవ్రతను తగ్గించటానికి అవకాశం వుందా అనేది మా ప్రశ్న. అందుకు మా 'క్లీన్' గారి అభిప్రాయాలు ఇలా వున్నాయి.

"అది అధికార పక్షమైనా, ప్రతిపక్షమైనా వాటికి బూతులు కావాలి. పైకి అసెంబ్లీలలో, పార్లమెంట్లలో, అలాగే మేధావుల చర్చల్లో ఈ బూతుల గురించి ఆవేశపడతారు. కన్నీళ్లు పెట్టుకుంటారు. వికటాట్టహాసాలు చేస్తారు. బూతురాజు, బూతు చక్రవర్తి, బూతు సామ్రాట్ బిరుదులు అంతర్గతంగా ఇచ్చుకుంటారు. అంతే తప్ప అలాంటి వాటిని నిషేధించమని చట్టాలను చేయరుగాక చేయరు. ఒకవేళ ప్రయత్నం చేసినా ఆ బిల్లు సభ ముందుకు రానీయరు. వాకౌట్లు చేస్తారు. బిల్లు ప్రతులు చించి గాలిలోకి విసిరేస్తారు. బహిష్కరణలు వుంటాయి. అధికార పక్షంలోనూ బోల్డన్ని సవరణలు చెబుతారు. అసలు రాజ్యాంగాన్ని మార్చాలంటారు. అది అంత తేలికా నాయనా" అని మంచినీళ్లు తాగాడు.

"అంటే ఎల్లకాలం మనం ఈ సోషల్ మీడియా విజ్ఞానాన్ని భరించాల్సిందేనా?" అన్నాడు విదు.

"అంతే కదా జెన్-జీలూ" అన్నాడు మిస్టర్ క్లీన్.

"అసలు ఈ రాజకీయ పార్టీలు క్లాసులు ఇప్పించాల్సింది?" అంటుంటే?

"ఎవరికి?" అన్నాను.

"కార్యకర్తలకు, నాయకులకు, ఒక్క మాటలో అందరికీ" అంది అన్య ఆవేశంగా. అప్పుడు నేను మాట్లాడటం మొదలుపెట్టాను.

"గురువర్యా - విత్ డ్యూ రెస్పెక్ట్ మీకు ప్రణామాలు. ఎల్లకాలం ఈ సోషల్ మీడియా అనండి. యూ-ట్యూబ్‌ల దరిద్రాన్ని, దాని ఊపుని తగ్గించాలంటే ఓ మార్గం వుంది. ముందు సోషల్ మీడియాని బహిష్కరించాలి. అది రూల్డ్ అవుట్. ప్రభుత్వాలే కాదు. మేధావులూ అందుకు ఒప్పుకోరు. అయితే వ్యూస్‌ని బట్టి వీరికి డబ్బులు ఇవ్వటం మానేయాలి. అప్పుడు మూడు వంతుల ఛానల్స్ మూతబడతాయి" అన్నాను.

"అందులో ప్రకటనలు వస్తుంటాయి. వాటిని ఎందుకు ఆపుతారు?" అన్నాడు విదూ.

"అసలు ఆ ప్రకటనలను ఎవరూ చూడరు. వివాదాల గురించి వింటుంటారు. ముందు 'గంట'ను నొక్కటం మానాలి. ఎవరూ ఉచితంగా కూడా చందాదారులుగా చేరకూడదు. అసలు ఇలాంటి ఛానళ్ళలో వచ్చే ప్రకటనలకు చెందిన వస్తువులను బహిష్కరించాలి అని ఉత్తరాలు రాయాలి. బహిరంగ సభల్లో మాట్లాడాలి. ఎక్కడ అవకాశం వుంటే అక్కడ ప్రచారం చేయాలి. ముందు దొంగ పేర్లతో వచ్చే ఛానల్స్‌ను అంగీకరించకూడదని సంస్థలకు మెయిల్ ఇవ్వాలి. ప్రజలు కూడా ప్రభుత్వాల ముందు కొన్ని డిమాండ్లు పెట్టాలి. మీరు ఇలాంటి పనులు చేసి, మంచి చట్టాలు చేస్తేనే మీకు ఓట్లు వేస్తాం అని రుచి చూపించాలి. అప్పుడే మెల్లమెల్లగా ఈ దరిద్రాలు వదులుతాయి" అన్నాను.

"మేంగో చెప్పింది వాస్తవం. ఈ రకరకాల ఛానల్స్ కు పేమెంట్లు ఆగిపోతే సగం పైగా ఆగిపోతాయి. మనుషులు సంతోషంగా వుండటానికి, మనసులను నిర్మలంగా వుంచుకోవటానికి ప్రయత్నాలు మొదలుపెడతారు" అంది అన్య.

"బాగుంది రా. మీరు చర్చలు మొదలుపెట్టండి. ఇది సక్సెస్ అవుతుందా లేదా అనేది మనకు అనవసరం. నిజానికి చీమలు పెట్టిన పుట్టల్లో పాములు చేరినట్లు, ప్రతి ఆవిష్కరణ మంచి కోసం మొదలవుతుంది. వాటిని దుర్మార్గులు ఆక్రమించుకుంటారు. అసలు విషయం చెబుతున్నాను.

'మనం మనుషులం' అని మరిచిపోయి కులాలం, మతాలం, ప్రాంతాలం అనే భావజాలం నుండి బయటపడకపోతే ఎవరు రెచ్చగొట్టినా రెచ్చిపోతాం. సంయమనంతో ఆలోచించటం మానేస్తాం" అన్నారు మా మిస్టర్ క్లీన్!

మరికొన్ని సీరియస్ అంశాలున్నాయి మాట్లాడుకుందాం!



డాక్టర్ సూరికి అవార్డు ప్రదానం చేస్తున్న డాక్టర్ కె.వి.రమణాచారి, వంశీ రామరాజు, అల్లూరి గౌరీలక్ష్మి, అత్తలూరి విజయలక్ష్మి, సరస్వతి కరవధి, కామేశ్వరి చెంగల్వల, మీనాక్షి.

# డాక్టర్ సూరికి ప్రసూతి ప్రాణదాయికి అవార్డు

హైదరాబాద్,జూన్ 26:(నేటినిజం ప్రతినిధి) తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో లేఖిని రచయిత్రుల వేదిక, సరసిజ థియేటర్ ఫర్ విమెన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమం డాక్టర్ సూరికి ప్రసూతి ప్రాణదాయిని బిరుదు-గుండు లక్ష్మీ నరసమ్మ స్మారక పురస్కారం ప్రధానోత్సవ కార్యక్రమం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి డాక్టర్ సూరికి ప్రసూతి ప్రాణదాయిని- గుండు లక్ష్మీ నరనరసమ్మ స్మారక పురస్కారం ప్రదానం చేశారు. అనంతరం మాట్లాడుతూ ఆసుపత్రుల అభివృద్ధికి తోడ్పడటంలో ఉన్న నిబద్ధత రోగుల పట్ల చూపిందని నేటి కార్పొరేట్ వైద్య, వ్యవస్థ, సేవాభావంతో రెండు లక్షలకు పైగా ప్రసవాలు చేసిన డాక్టర్ సూరిని ఆదర్శంగా తీసుకుని వైద్యవృత్తిలో విలువులు పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సభా అధ్యక్షుడుగా వల్లీశ్వర్, అత్తలూరి విజయలక్ష్మి, డా॥ పద్మావతి, వంశీ రామరాజు తదితరులు ప్రసంగించారు.


అనంతరం లేఖిని సరసిజ సంస్థలకు ధన్యవాదాలు తెలిపారు. లేఖిని కార్యవర్గ సభ్యులు అల్లూరి గౌరీలక్ష్మి, సరస్వతి కరవధి, కామేశ్వరి చెంగల్వం, మీనాక్షి తదితరులు పాల్గొన్నారు. సభకు కె.రామచారి శిష్యబృందం చేజెర్ల వినయ బృందంచే సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

## దేశ భక్తి

దేశం నిండారా
దేశ భక్తి అంటే
ద్వేషభక్తిగా మారింది..
దేశప్రజల మనుగడ
ప్రశ్నార్థక మవుతుంది
నేడు అందరూ
ద్వేషాన్ని ఆవాహన చేస్తున్నారు...
విద్వేషాలతో
ఆనందిస్తున్నారు..
భిన్నత్వాన్ని భిన్నంగచూస్తూ
ఏకత్వాన్ని ఎద్దేవచేస్తున్నారు...
సహనం అసమర్థత అయింది
ప్రేమ ద్రోహమయి పోతుంది.
ఇప్పుడు
దేశభక్తికి శీల పరీక్ష..
భావాలను..భాషను
ఆచారాలను..విధానాలను
దేశభక్తికి భాష్యాలు
జాతీయతకు కొలమానాలు..?
అమ్మనుండి అందంగా నిత్యం
గమ్మత్తుగా విడదీస్తున్న దవుర్భాగ్యం....
విద్వేషాల రవణకాష్టాలో
అయోధ్య... మాతరాల
ఆజ్యా లెన్నెన్నో అనునిత్యం దొరుకుతాయి.
చారిత్రక పురాణపురుషుల
చరిత్రల పై కూడా కలుషిత
సిరామరకలు మారుస్తున్నాయి...
మతం కావికళ్ళ మత్తు
మనిషిని ప్రశ్నిస్తుంది.
రాజకీయ రణతంత్రం
పాచికల్లో
రాజ్యాంగం చిద్రమయింది.
అణచివేయబడ్డ వర్గాలన్నీ
ఆత్మఘోషలన్నీ
నినదలవుతున్నె
దేశభక్తి వజ్రాయుధం అవుతూంది...
మరో స్వతంత్ర పోరాటం
ఆవశ్యక. మవుతుంది
అన్ని నాటకాలకు
అంత్యకాలం సమీపిస్తోంది..
ఇక నిజమైన దేశభక్తుడెవరో
ఈ తరం నిర్ణయిస్తుంది..



=డా॥ఫణి కుమార్ చకిలం
8978979545.






ఫేస్ బుక్ "అమరావతి సాహితీ మిత్రులు" గ్రూపులో డా॥ రావి రంగారావు వారం వారం సాహిత్యం వర్క్ షాపులు నిరంతరాయంగా నిర్వహిస్తున్నారు.

ఈ వారం వచన కవితల వర్క్ షాపు... అంశం "దిగులు". విజేతల కవితలు చదవండి.

-సంపాదకులు

-డా॥రావి రంగారావు
9247581825

## దిగులు

పలుకరించని
పియురాలే కాదు.
పట్టెడన్నం పెట్టని
కొడుకూ దిగులే.....
కంటికొసన కన్నీరే కాదు.
తెచ్చిపెట్టుకున్న చిరునవ్వూ దిగులే...
అక్షరాలకై నిద్రపోని
రాత్రులే కాదు.
చప్పట్లు ఎరుగని ప్రశంసలూ దిగులే....
వదిలిపోయిన అడుగులే కాదు.
ఉండిపోయిన
జ్ఞాపకాలూ దిగులే...
రాలిపడిన శిశిరాలే కాదు.
చిగురించని
వసంతాలూ దిగులే....
దారి తప్పిన జీవితాలే కాదు.
దారి తెలియని
జెన్-జీ లూ దిగులే...
దిగులంటే...
కనుల గిరుల నుండి
ఉవ్వెత్తున దూకే
ఉప్పునీటి జలపాతాలు....
కనురెప్పల
ఊయలపై
భారంగా
దిగులు పక్షి....
లోచనల్లో
ఆలోచనల్లో
అంతా శూన్యం
అయినా అవిశ్రాంతం....
బాధని కూడా
ఆనందంగా
అనుభవించలేని
అదృష్టం...
దిగులు నన్నెప్పుడూ
చంపేయలేదు....
నన్ను ఖాళీ చేసి
మౌనంగా వెళ్ళిపోతుంది....
ఆ మౌనంలోనే
కొత్తకవిత చిగురిస్తుంది...

-శివకుమార్ యెనికేపల్లి
9989385898

## అంతరంగ సూర్యోదయం

దిగులు
తలుపు తట్టి రాదు,
సాయంత్రపు నీడలా
నెమ్మదిగా అడుగులు వేస్తూ,
కనురెప్పల వెలుగును మసకబార్చి,
మనసు నేలలో
నిశ్శబ్దపు వేర్లు విస్తరిస్తుంది.
అప్పుడు...
ఇల్లు అదే.
వీధి అదే.
ఆకాశం అదే.
మారిపోయేది మాత్రం
ప్రపంచం కాదు?
ప్రపంచాన్ని చూసే
మనసే మారుతుంది.
కాలం
నదిలా ప్రవహిస్తూనే ఉంటుంది.
మనసు మాత్రం
జ్ఞాపకాల ఒడ్డున
ఒక విరిగిన పడవలా
నిశ్చలంగా నిలిచిపోతుంది.
చెప్పలేని మాటలు,
చేరలేని మనుషులు,
చెదిరిన స్వప్నాల శకలాలు?
అన్నీ కలిసి
మనిషి హృదయంలో
ఒక నిశ్శబ్ద సముద్రాన్ని
నిర్మిస్తాయి.
బయట? చిరునవ్వు.
లోపల? అలలెత్తే వేదన.
ఆ నవ్వు సంతోషానికి గుర్తు కాదు;
కన్నీటికి మనిషి ఇచ్చుకున్న మర్యాద.
కానీ...
ప్రకృతి ఎప్పుడూ అబద్ధం చెప్పదు.
విత్తనం చీలక మొలక రాదు.
ఆకు రాలక వసంతం రాదు.
నది రాళ్లను ఆలింగనం చేయక
సముద్రాన్ని చేరదు.
రాత్రి తన చీకటిని పూర్తిగా భరించక
ఉదయాన్ని ప్రసవించదు.
అలాగే...
వేదనను దాటని హృదయం
ఆనందానికి అసలు అర్థాన్ని
ఎప్పటికీ తెలుసుకోదు.
దిగులు శిక్ష కాదు,
జీవితం మనలో దాచిన
అజ్ఞాత శక్తిని వెలికితీసే
శిల్పి ఉలి.
ప్రతి కన్నీటి బొట్టు
ఓటమి కాదు?
హృదయశిలపై
ధైర్యాన్ని మలిచే
శిల్పి స్పర్శ.
అందుకే...
దిగులును నిరాకరించకు
దాని నుండి పారిపోకు
దాని పక్కనే
కొద్దిసేపు మౌనంగా కూర్చొని,
అది దాచుకున్న అర్థాన్ని ఆలకించు.
మౌనం అడిగే ప్రశ్నలే
ఆత్మాన్వేషణగా మారుతాయి.
ఆ అన్వేషణలోనే
మనిషి ప్రపంచాన్ని కాదు?
తనను తాను కనుగొంటాడు.
అప్పుడు తెలుస్తుంది...
సంతోషం
బయటి ప్రపంచం ఇచ్చే
బహుమతి కాదని,
అది చీకటిని దాటిన
అంతరంగపు వెలుగు అని.
వేదనను అర్థం చేసుకున
హృదయపు ప్రశాంతత అని,
తుఫానును దాటిన
సముద్రపు నిశ్చలత అని.
దిగులు మేఘాలన్నీ
చెల్లాచెదురైన తర్వాత కాదు?
ఆ మేఘాల ముసుగు నుంచే
వెలుగును స్పృశించిన క్షణాన
అంతరంగ సూర్యోదయం
ఆవిష్కృతమవుతుంది.
అదే...
మనిషి పునరావిష్కరణ.
దిగులును జయించినందుకు కాదు;
దిగులును
అర్థం చేసుకున్నందుకు.
అదే అంతరంగ సూర్యోదయం.
అదే శాశ్వత సంతోషం.

- పేర్లి దాసు
9963249775

## ముగిద్దాం దిగులుని

మనసు మన దగ్గరే ఉంటుంది
కానీ... మాటే వినదు,
మాటలు వినిపిస్తూనే ఉంటాయి
కానీ...భావాలు ఎద కెక్కవు,
చూపులు ఆకాశమంతా పరుచుకుంటాయి
కానీ...
కనురెప్పలలో జీవం ఉండదు,
ఆశయాలు
పెరిగిపోతుంటాయి
కానీ....
ఆశలే సుదూరంగా
పేరుకుపోతుంటాయి,
ఏదో.... ఘర్షణ...
గుండెకీ... మస్తిష్కానికీ మధ్యన
కానీ....
ఆ ప్రశ్న ప్రశ్నగానే భయపెడుతుంటుంది...
వలపు దూరమయినా
తలపు దెయ్యమయినా
వగలు బరువయ్యినా
పగలు చీకటయినా
నమ్మకం తిరగబడినా
పెంపకం అవిరయినా
కలం మూగదయినా
కాలం మాయమయినా
దిగులు.... దగ్గరకు చేరుతుంది
దిగులు... ధైర్యాన్ని చంపేస్తుంది
దిగులు... దిశని కప్పేస్తుంది
దిగులు... దీపాన్ని మూసేస్తుంది
మనసుకు పట్టిన ముసురులా
దిగులు భయపెడుతుంటుంది
కానీ....
ఆ దిగులు నుండి పుట్టే తెగింపు మాత్రం
ఖచ్చితంగా
దిగులుని దూరం చేస్తుంది శాశ్వతంగా.

-శ్రీఅరుణం శ్రీనివాస్, 9885779207


పుస్తక సమీక్ష

# ఆణిముత్యాలు ఈ స్వాతి చినుకులు

**"ఎన్నికలొస్తే**
**ఓటర్లవి ఎన్ని కలలో**
**అభ్యర్థులవి ఎన్ని కళలో..."**

ఒక సత్యాన్ని అద్భుతమైన రెండు పాదాల్లో నిక్షిప్త పరిచిన స్వాతి చినుకు ఇది.కలలు,కళలు రెండు పదాల ప్రయోగంతో అద్భుతమైన భావనను సాధించారు.

**"స్వాతి చినుకులు"** అంటే స్వాతి కార్తెలో (స్వాతి నక్షత్రం సమయంలో) కురిసే వర్షపు బిందువులు అని అర్థం. జ్యోతిష శాస్త్రం మరియు పురాణాల ప్రకారం ఈ సమయంలో పడే వర్షపు చినుకులు ఒకవేళ ఆలిచిప్పలలో పడితే, అవి ముత్యాలుగా మారతాయని ఒక నమ్మకం మిగిలిన కార్తెలలో పడే నీటి కంటే, స్వాతి చినుకులు అత్యంత పవిత్రమైనవి, విలువైనవిగా భావిస్తారు.



ప్రతులకు :
నాగమల్ల పున్నంచందర్
9963727551

నాగమల్ల పున్నంచందర్ గారు తను రాసిన లఘు కవితలకు స్వాతి చినుకులు అని పేరు పెట్టడంలో గొప్ప అర్థం ఉంది.ఇవి పవిత్రమైన ఆశయంతో రాయబడిన ముత్యాల రాశులు.సమాజానికి అనునిత్యం ఉపయోగపడే అక్షర సత్యాలు.

నాగమల్ల పున్నం చందర్ గారు జీవశాస్త్ర ఉపన్యాసకులుగా పనిచేస్తూ తన ఆలోచనలను అక్షర రూపంలో సమాజానికి అందించే ప్రయత్నం చేస్తున్నారు. వీరు గతంలో పున్నం మాట శతకంతో పాటు నూతన సాహిత్య రూపమైన "త్రిపద చూర్ణం" అందించారు.ముచ్చటగా మూడవ పుస్తకంగా స్వాతి చినుకులతో మన ముందుకు వచ్చారు.

**"లోకం పోకడ**
**అవసరానికి నువ్వే అంత**
**అవసరం తీరాక నువ్వెంత"**

మానవ నైజానికి ప్రతీకలా నిలుస్తుంది ఈ స్వాతి చినుకు.

"మహిళలు తలుచుకుంటే
ఇంట్లోని మైలను తీస్తారు
వొంట్లోని మైలను తీస్తారు"

నేటి ఆధునిక సమాజంలో మహిళలు అబలలు కాదు సబలలే అన్న అంశాన్ని కొంత వ్యంగ్యంగా చూపారు. వారు తలుచుకుంటే అసాధ్యమన్నదేదీ లేదని తెలిపారు.

మానవ జీవితం బుద్భుద ప్రాయం... ఎప్పుడు అంతమౌతుందో తెలియదు. ఎప్పుడు ప్రారంభమౌతుందో ఊహించలేం. ఇదే విషయాన్ని

**"తల్లి గర్భం నుండి వచ్చేది తెలియదు**
**భూగర్భంలోకి పోయేది తెలియదు"** అని చక్కగా రెండు వాక్యాల్లో వివరించారు కవి.

జీవితంలో సుఖదుఃఖాలు ఉంటాయి.కష్టాలు వచ్చాయని బాధపడితే జీవితం ముందుకు సాగదు. అలాగే గతాన్నే తలుచుకుంటూ జీవించడం సరికాదు.ఈ రెండు అంశాలను జీవిత సత్యాలుగా పరిచయించారు కవి నాగమల్ల.

**"కష్టాలను ఎదుర్కొంటేనే గెలుస్తాం**
**గతాలను మరిస్తేనే నిలుస్తాం"**

**"విలువ తెలిసేది**
**కొన్నప్పుడు తెలుస్తుంది**
**కోల్పోయినప్పుడు తెలుస్తుంది"**

వస్తువే కాదు.మనిషైనా అంతే... ఉన్నప్పుడు వారి విలువ తెలియదు. దూరమయ్యాక తెలుస్తుంది. అందుకే తల్లిదండ్రుల అవసాన దశలో మనం వారికి తల్లిదండ్రులుగా ప్రేమ నందించాలి. అపురూపంగా చూసుకోవాలి. ఏ పరిస్థితిలోను బంధాలను దూరం చేసుకోకూ డదనే అంతరార్థం మనం గ్రహించాలి.

ఇంకా...

**"ప్రతి మనిషికి...**
**అజాతశత్రువులు ఉంటారు**
**అజ్ఞాత శత్రువులు ఉంటారు"**

**"అద్భుతం...**
**ఉండి బాధపడేవాడు లక్షాధికారి**
**లేకున్నా సంతోషపడేవాడు భిక్షాధికారి"**

**"గ్యాస్**
**ఇంట్లో లేకుంటే వంట ఆగిపోతుంది**
**వొంట్లో ఉంటే మంట పెరుగుతుంది"**

**"చేజారితే**
**అద్దం పగిలితే శబ్దం**
**గుండె పగిలితే నిశ్శబ్దం"**

**"గంజి**
**ఉన్నవారికి బట్టకు**
**లేనివారికి పొట్టకు"**

నాగమల్ల పున్నం చందర్ తన స్వాతి చినుకులు పుస్తకంలో మానవ జీవితానికి అవసరమైన సూక్తులను, మంచి మాటలను స్వాతి చినుకులు అనే రూపంలో ఆణిముత్యాలుగా మనకు అందించారు.


**-డా॥వైరాగ్యం ప్రభాకర్**
9014559059



## మనిషి విలువ

జీవితం అనే పుస్తకంలో
అందమైన పేజీ ప్రేమ.
ఆ ప్రేమను పంచే మనసే
మనిషికి నిజమైన సంపద.
మాటలు మరిచిపోవచ్చు,
చేసిన మేలు మరువలేరు.
ధనం కరిగిపోవచ్చు,
మంచితనం మాత్రం
చిరస్థాయిగా నిలుస్తుంది.
ఒక చిరునవ్వు
వంద బాధలను కరిగిస్తుంది.
ఒక మంచి మాట
విరిగిన హృదయానికి
ప్రాణం పోస్తుంది.
ఎత్తుకు ఎదగడం గొప్ప కాదు,
ఎదిగిన తర్వాత
ఒదిగి ఉండడమే గొప్ప.
మన కోసం
జీవించడం సాధారణం,
ఇతరుల కోసం
జీవించడం అసాధారణం.
చివరికి మనతో వచ్చేది
సంపద కాదు... పదవి కాదు...
మన వల్ల ఎవరి కళ్లలోనైనా
మెరిసిన ఆనందబాష్పమే
మన జీవితానికి
నిజమైన గెలుపు.

**-అనిత గుజ్జరి**
9394221927



## హిత శత్రువు !

రాముడి చేతిలో కోదండం
కన్నయ్య కరంలో సుదర్శన చక్రం
భీముడి హస్తంలో భారీ గదా
పరశురాముడి చేతిలో గొడ్డలి
అర్జునుడి చేతిలో గాండీవం
వృద్ధుడి మూడో హస్తం చాదస్తం
నడవంత్రపు నరుడి అరచేతిలో..
మొలిచె
ఆరో అంగమైంది స్మార్ట్‌ఫోన్!.
చిన్నారుల అరచేతులోనూ..
తిష్టవేసింది ఆప్త శత్రువు
నాడు పుస్తకం హస్తభూషణం..
నేడు చరవాణే హస్తభూషణం
డిజిటల్ ఫోన్ చేతిలో లేనిదే
ముద్ద దిగనని మారం చేస్తోంది
మానవుడి మతి పోగొట్టేస్తోంది
నేడు ఆరో అంగం వచ్చి చేరింది!.
రామణుడికి పది తలకాయలు..
ప్రపంచ బలశాలి సెల్‌ఫోన్‌కు..
వాట్సాప్, ఫేస్‌బుక్, యూట్యూబ్..
లాంటి తలకాయలు
ఎన్నో ఎన్నెన్నో..
సోషల్ మీడియా వ్యసనాలు..
భావోద్వేగ భస్మాసుర హస్తాలు
అరిష్టాన్ని ఆలింగనం చేసుకోవద్దు
మానసిక రుగ్మతల ఆహ్వానిచొద్దు!.
పరిమితిలో వాడితేనే ప్రగతి..
అవసరానికి వాడితే అభివృద్ధి
దుర్వినియోగం చేస్తే మానసిక రోగి
వెర్రితలలు వేస్తే వ్యక్తిత్వ అధోగతి
తెలివిగా వాడితే ఆప్తమిత్రుడు
అతి చేస్తే గతి చెడగొట్టే శత్రువు
క్షణం దూరమైతే
శ్వాస ఆగుతుంది
వరమో, శాపమో
తెలియని దుస్థితి !

**-మధుపాళీ**
9949700037



## వానస్వరాలు

వాన ఎత్తుకున్న రాత్రిస్వరం
ఇంకా మోగుతూనే ఉన్నది,
మేఘాలగొడుగుల వెనక సూరీడు
మొహం దాటేసాడు,
ఉక్కపోతల తలలను ఎగురగొట్టి,
చల్లగాలికత్తి స్వైరవిహారం చేస్తున్నది,
నీటిలో పడవలుగా
మొలవాల్సిన బాల్యం
సెల్ఫోనుకౌగిట్లో ఇంకా
నిదురలోనే జోగుతున్నది,
దారులు గొడుగులై మొలిచి
రంగురంగుల
కవాతులు చేస్తున్నవి,
బైకులు,రేయిన్ కోటుల
పరుగులతో
వాన పందిరిలో ఆడుతున్నవి,
ఆదివారమై తడిసిన నగరం
మెత్తబడిన పానమైంది!
పని చేస్తేనే
పొట్టనిండే గొంతులు కొన్ని
వీథుల్లో పండ్లె,కూరగాయలై
వాననెదిరిస్తున్నాయి!

**-డాక్టర్ కాసర్ల**
9441406252



## చిలుక సాయం

సుందర వనం అనే అడవిలో ఒక తోడేలు ఉండేది. అది ఒకసారి ఆహారానికి బయలుదేరింది. దానికి ఒక చెట్టు పైన చిలుక కనిపించింది. అప్పుడు అది "ఈ చిలుకను పట్టుకున్నా లాభం లేదు . దీనిని తింటే నా కడుపు నిండదు. చిలుక సాయం సంగతి జంతువులన్నింటికీ తెలుసు. దీనికి పరోపకారి అనే పేరు ఉంది. అందువల్ల దీనిని ఆహారం జాడ గురించి అడుగుతాను"అని అనుకొంది.

వెంటనే ఆ తోడేలు చెట్టు పైన ఉన్న చిలుకతో " ఓ చిలుకా! నాకు చాలా ఆకలిగా ఉంది. ఈ చుట్టు ప్రక్కల ఆ ఆహారం ఎక్కడ లభిస్తుందో చెప్పు ! నీవు ఆకాశమార్గాన వెళ్లి చూసి ఉంటావు" అని అడిగింది. అప్పుడు అది "తోడేలు మామా! ఇక్కడి నుంచి కుడివైపు వెళితే నీకు దగ్గరలోనే ఆహారం లభిస్తుంది" అని చెప్పింది. తోడేలు అది చెప్పినట్లే వెళ్లి ఆహారం తిని వచ్చింది.

మరుసటి రోజు మళ్లీ తోడేలు వచ్చి చిలుకను ఆహారం గురించి అడిగింది. అది ఎడమవైపు వెళ్ళమని చెప్పింది. ఇంకొకసారి తోడేలు అడిగితే అది తూర్పు వైపు వెళ్ళమని చెప్పింది. మరొక రోజు తోడేలు ఆ చెట్టు వద్దకు వచ్చి చిలుక కొరకు చూస్తే ఆ చిలుక అక్కడ లేదు. అప్పుడు తోడేలు అక్కడ ఉన్న కోతిని చిలుక గురించి అడిగింది. ఆ కోతి తనకు తెలియదంది. ఆ తోడేలు ఆకలితో చాలా దూరం వరకు వెళ్లి ఎలాగో ఆహారం సంపాదించుకుంది.

ఇంతలో దానికి ఎదురుగా ఒక నక్క ఈ చిలుకను నోట పట్టుకొని కనిపించింది. ఆ తోడేలు కోపంతో " ఓ నక్కా! ఆ చిలుక నా నేస్తం. దాన్ని వదిలిపెడతావా! లేదా!" అని అంది. నక్క అందుకు ససేమిరా అనడంతో తోడేలు నక్క పైకి ఒక్క ఉదుటున ఉరికింది. దాని భయానికి నక్క ఆ చిలుకను అక్కడే వదిలిపెట్టి పారిపోయింది.

ఆ చిలుక ఎంతో సంతోషించి" ఓ తోడేలు మామా! నీకు ఆహారం జాడ చెప్పినందుకు నా ప్రాణాలను కాపాడావు.

నీ మేలు మరువను "అని అంది. " అయ్యో! చిలుకా! నీవు చాలా మంచి దానివి. పరోపకారివి. అన్నింటికి సాయపడే నీలాంటిది పది కాలాలపాటు ఈ లోకంలో బ్రతికి ఉండాలి.

అందుకే నేను నక్కతో పోట్లాడటానికి కూడా సిద్ధపడ్డాను. నీవు లేకపోయేసరికి నాకు ఆందోళన కలిగింది. ఇక ముందు నీకు ఏ ఆపద వచ్చినా నాకు వచ్చినట్లేనని భావిస్తాను "అని అంది.

ఆ మాటలకు చిలుక ఎంతో సంతోషించి "నేను ఇతరులకు సాయపడడం వల్లనే నా ప్రాణాలు నిలిచాయి.

ఇకముందు కూడా ఇలాగే ఇతరులకు సాయం చేస్తూ కాలం గడుపుతాను" అని పలికింది.


**-సంగనభట్ల చిన్న రామకిష్టయ్య**
9908554535



## సంయమనం

గద్దలా తన్నుకుపోయేందుకు
గుంటనక్కలా ఎదురుచూస్తూ
గుంపులు గుంపులుగా తిరుగుతున్న
గోముఖ వ్యాఘ్ర సమూహాలు.
కావరం కౌర్యంగా మారి
కరుణను చెరబడుతూ
అరువు తెచ్చుకున్న మాటలతో
అకారణంగా అంగడంగడి చేస్తూ
అమాయకులను బలి తీసుకుంటుంది.
భ్రమలో బ్రతుకులను దించి
భాషకు భగవంతునికి లంకెపెట్టి
బందిఖానాల మెట్లెక్కె మదాంధ
బుద్ధిహీనులతో సమాజం బాగుపడుతుందా.
మాటలతోనే మంటలు రేగడానికి
చిచ్చు పెడితే చైతన్యం పోవడానికి
గుడ్డిగా గడ్డ కట్టుకపోవడానికి
ఈ మన్నేమైనా మామూలుదా ?
సనాతన అధునాతన సంకుల సమరాన్ని
సంయమనంతో సమన్వయపరిచి
సమయస్ఫూర్తితో సర్దుకుపోయే
స్థితప్రజ్ఞ
సద్గుణ సమాజమిదిరా...

**-డా.ఎడ్ల కల్లేశ్**
9866765126



## వానలో నామనసు ప్రయాణం

వలచి వచ్చిన వానా!
నిన్నేమైనా నేను పిలిచానా?
తెలియకుండా వచ్చేస్తావు
చెప్పకుండానే వెళ్లిపోతావు
కుంభవృష్టితో ఒకసారి
కునుకులేకుండా రైతుకు మరోసారి
వరికంకులు వేదాలు చెప్తూంటే
మట్టి వాసనల ధరణి
ఉఛ్వాస నిస్వాసాలు
శ్రావణలక్ష్మికి రైతు
బహుమానంగా ఇవ్వాలని
కాబోలు అతనికోసం
వచ్చేస్తూఉంటావు
నువ్వు బహు చక్కనిదానివే
నిన్నుచూసి రైతు
మురిసిపోతున్నాడే ఎంచక్కా
అతనికి మాత్రం చెప్పవే నీరాక!


**-గరిమెళ్ల కాశీఅన్నపూర్ణ**
9618586277



పుస్తక సమీక్ష

# తెలుగువారి కీర్తిపతాక - చిత్తలూరి

హైకూ రచనలో హైకూలకు పుట్టినిల్లైన జపాన్ వాళ్ళచే పలు అంతర్జాతీయ బహుమతులు,ఎన్నో ప్రశంసా పత్రాలను అందుకున్న ప్రముఖ తెలుగు కవి చిత్తలూరి సత్యనారాయణ. ఎంతోమంది హైకూ కవులు తెలుగులో పలు సంపుటాలు వెలువరించవచ్చుగాక కానీ ఆంగ్లంలో హైకూ సంపుటిని(Skipping Stones) వెలువరించిన తొలి తెలంగాణ కవి మాత్రం చిత్తలూరి.



ప్రతులకు:
**చిత్తలూరి**
8247432521



ప్రస్తుతం తెలుగులో కవిత్వం రాస్తున్న సీనియర్ కవుల్లో అత్యంత ప్రముఖ కవి చిత్తలూరి . ముక్కు సూటిదనం,ప్రశ్నించే తత్వం, వేగంగా రాయడం చిత్తలూరి కలానికీ, గళానికీ ఉన్న ప్రత్యేకత. "మా నాయిన" కవితా సంపుటితో మొదలై **"నల్ల చామంతితో"** తెలుగు సాహిత్యంలో తనకంటూ విశిష్ట స్థానాన్ని సంపాదించుకున్నారు. కవిత రాసినా, కథ రాసినా, విమర్శ రాసినా మినీ కవిత రాసినా, హైకూలు రాసినా అత్యంత చిక్కగా రాస్తారు. ఈ **"లాంతరు గ్లాసు"** వీరి హైకూ తెలుగు సంపుటి. ఇందులోని హైకూలన్నీ దేనికవే ప్రత్యేకంగా ఉన్నాయి. ఉదాహరణకు ఈ క్రింది హైకూలను చూడండి

**"లాంతరు గ్లాసు**
**తుడువబుద్ది కాలేదు**
**అమ్మ వేలి ముద్రలు"**

లాంతరు గ్లాసు తుడువబుద్ధి కాలేదు అన్నప్పుడు మనకు దానికి కారణాలు రకరకాలుగా ఆలోచిస్తాం. బహుశా పని ఎక్కువైందని ఇష్టం లేకనో, పాతదే కదా అని నిర్లక్ష్యపు ధోరణో అందుకే తుడవలేదని ఆలోచిస్తాం కానీ చివరి వాక్యం అమ్మ వేలి ముద్రలు అన్నప్పుడు మనకు కళ్లలోంచి నీళు రాకమానవు. ఒక చిన్న వాక్యంలోనే అమ్మలేనితనాన్ని, అమ్మపై తనకున్న ప్రేమను ఇంత గొప్పగా వ్యక్తపరచడం ఎంత అద్భుతం. అమ్మను కోల్పోయిన ప్రతి కళ్లలో నుంచి నీళ్లు తెప్పించే హైకూ ఇది. అలాగే చదువు ప్రాముఖ్యత చెప్తూ రాసిన ఈ హైకూ చూడండి

**"పుస్తకాల సంచిని**
**పక్కన పడెయ్యకు**
**చిత్తు కాగితాల సంచి చేతికొస్తుంది"**

పుస్తకాల సంచిని పక్కన పడెయ్యకు అన్నప్పుడు అది మాసిపోతుందని అలా చెప్తున్నాడేమో అనిపిస్తుంది కాని చివరి వాక్యం "చిత్తు కాగితాల సంచి చేతికి వస్తుంది" అన్నప్పుడు చదువు నిర్లక్ష్యం చేస్తే ఏమవుతుందో అనే నిజాన్ని ఇంత గొప్పగా చెప్పాడా అని అనిపిస్తుంది,కవికి అభినందనలు తెలుపకుండా ఉండలేం.

అలాగే

**"నా ఈ సిరా చుక్కలన్నీ**
**అమ్మానాన్నల**
**చెమటచుక్కలే"** అనడంలో తన కోసం తన తల్లి దండ్రులు పడ్డ కష్టం కనిపిస్తుంది. తల్లి దండ్రులను నిరంతరం గుర్తుకు చేసుకునే మంచి కొడుకు కనబడతాడు. చిత్తలూరి దాపరికం లేని కవి. ఏ విషయమైనా కుండబద్దలు కొట్టినట్టుగానే చెప్తారు, ఎప్పటికప్పుడు కొత్తగా ఆలోచిస్తారు. తన రచనలచే ఆలోచింపజేస్తారు. మనిషి ఎప్పుడు మూసధోరణిలో వెళ్లకూడదని కొత్తగా ఆలోచించి కొత్త మార్గాలు వేసిప్పుడే నవసమాజం ఆవిష్కృతమవుతుందని చెబుతాడు. ఆ విషయాన్ని చెబుతూ

**"అందరు నడిచే బాటకు**
**అలవాటు పడిన కాళ్లు**
**కొత్త బాటను నిర్మించలేవు"**

అని అంటాడు నిజమే కదా!

చిత్తలూరిగారి అభివ్యక్తి చాలా అద్భుతంగా ఉంటుంది

**"చిన్నప్పుడు**
**నాకీతనేర్పిన బావి**
**ఇప్పుడు భూమిలో దాక్కుంది"** అనడం ఎంత గొప్ప అభివ్యక్తి .బావులు మాయమైన విషయాన్ని ఎంత అద్భుతంగా చెప్పాడో ! అలాగే

**"చేజారిన అద్దం -**
**నీలాకాశం ముక్కలై**
**నేలంతా పరచుకుంది"** అనే హైకులో పగిలిన అద్దం ముక్కలలో కనిపించే విషయాన్ని గొప్పగా దృశ్యమానం చేస్తాడు.

ఇందులో హైకూలలో కొన్ని అమ్మానాన్నల ప్రాముఖ్యత తెలిపేవి, మరికొన్ని తాటి చెట్ల గొప్పదనాన్ని తెలిపేవి,మరికొన్ని భార్య గొప్పతనాన్ని తెలిపేవి, ఇంకొన్ని సమాజాన్ని తట్టి లేపేవి మరికొన్ని సమాజంలోని రుగ్మతలను ఎత్తిచూపేవి ఉన్నాయి. నిరంతరం ఆన్లైన్ లో తన కవిత్వం ద్వారా,హైకూల ద్వారా పలకరించే చిత్తలూరి గారు ఆఫ్‌లైన్లో వాటిని పుస్తకంగా తీసుకురావడం బాగుంది.

**- ఎన్.నరేశ్ చారి**
9701334516



## ఒక నిశబ్ద కావ్యమే నాన్న మనసు

పిల్లల జీవితమే తన లక్ష్యం
వారి విజయమే తన ఆనందం
తన కోరికలు మరిచి
వారి ఆశలు తీర్చ
ఆరోగ్యం సహకరించకున్నా
తన ఆకలిని దాచుకుని
తన బిడ్డలు ఎదురు తిరిగినా
తన మాటలు దిక్కరించినా
తనను విడిచి దూరంగా వెళ్ళినా
తన గుండెలో ప్రేమను మార్చుకోడు
తన శ్రమ చెమట చుక్కల వెనుక
తన పిల్లల భవిష్యత్తు వెలుగుల ఆశతో
వారి సంతోషమే తన మనసుకు తృప్తిగా
నిశ రాత్రులలో నిశబ్ద ఆలోచనలతో
తనకు తానే ప్రశ్నించుకుంటూ
కాలం గడపటమే తను నేర్చుకున్న పాఠం
తన మౌనంలో దాగిన ప్రేమ
తన బాధలో వెలిసిన త్యాగం
ఒక నిశబ్ద మహా కావ్యమే?!

**-డా॥ సుధాకర్ గుమ్మడి**
9440125495



## పొద్దుటి రంగు


సూర్యోదయ వర్ణం
వివర్ణమవుతూ ఉంటుంది !
గడియారం
అవిశ్రాంతంగా చెక్కుతూ ఉంటుంది
రంగు రంగుల నిర్మాణాలని,
నీరాజనాలని !.
కుండ పగిలి పాలు నేల పాలైనట్లు
జ్నానమ్ వొలికిపోయి నేలపాలవుతుంది!
లేత గొంతుకులకి
మైకులు అందడం లేదు !
ఉంగరాల జుట్టులాంటి కొండని
బోడుగుండుగానైనా మిగల్చకుండా
చితాభస్మంలా మార్చుతున్నారు !
వీధులన్నీ వైద్యశాలలౌతున్నాయి
నిర్వాధి నరుడు నడవల్లో
దొరకడం లేదు !.
మనిషి అంకె గాదు
యంత్రానికి లంకె కాదు
సంతల్లో సొమ్ముల్లా
సొమ్ము చేసుకోవడానికి !
పూజన్మల్లా పరిమళినీచడానికి
పరిశ్రమించాలి మనిషి !
ధనాగారాల జలక్రీడలు గావిస్తూ
గుణసంపద గాదెలని ఛిద్రం చేస్తున్నారు !
ఆకులూ కోకిలలూ
శిరస్సుల మీద మొలకెత్తాలి!.
వివర్ణమైన సూర్యోదయ వర్ణం
సాయంత్రానికి
పురిటి రంగు పులుముకున్నట్లు
మనిషి అంతరంగ వర్ణాన్ని
చిత్రించడం జరగాలి !
దేహదాహానికి దూరంగా జరిగి
లోపల దాక్కున్న మర్మ దాహాన్ని నింపాలి !
బేరసారాల్లేని పుట్టుకలకీ హారతి పట్టాలి !.

**-ఒబ్బిని,** 9849558842

పుస్తక సమీక్ష

# అల్లాడిప్రతిభకు నిదర్శనం ఈ కైతికాలు

అల్లాడి శ్రీనివాన్ గతంలో **ఎడారిపూలు** అనే పేరుతో ఒక కథా సంపుటిని వెలువరించి, తెలంగాణా యాసకు ఒక ప్రత్యేక మైన గుర్తింపు తెచ్చి, భళారా అనిపించుకున్నారు. అదే త్రోవలో ఇదిగో, మరో పుస్తకం వచ్చింది. అయితే ఇది ఈసారి కవితల పుస్తకం అన్నమాట. కానీ మన అల్లాడి ఏమన్నారంటే ఇది కైతకాల పుస్తకం. దీని పేరు **'గున్కపూలు'** అన్నారు. అంతే కాదు ఇది తెలంగాణ భాష లఘు రూప వచన కవిత్వం అంటూ చెప్పుకొచ్చారు. ఈ కైతి ను వారి వూరు భూషణరావుపేట ప్రజలందరికీ అంకితం ఇచ్చారు. తెలుగు భాష తెలంగాణా యాస లో ఎంత మధురాతి మధురంగా వుంటుందో ఈ కవితలు చదివితే తెలుస్తుంది. ఈ నా మాట నిజానికి నిజం. నానీలు, వ్యంజకాలు, హైకూలు, మణిపూసలు, రెక్కలు, రుబాయీలు, గజళ్ళు, ఇలా, అలా, ఎన్నో వచన కవితా రీతులు సాహితీలోకంలో మనకు దర్శనమిస్తున్నాయి. అలాగే, తెలంగాణా యాసలో 'కైతికాలు' అని కూడా ఒకకొత్త పేరుతో ఇకమీదట తెలంగాణా కవులూ, అందరూ ట్రై చేస్తే ప్రయత్నించితే ఎంత బాగుంటుందో అనిపిస్తోంది. ఎందుకంటున్నానంటే నేను 1965 నుండి హైదరాబాదులో వుంటున్నా, తెలంగాణా కోసం పలవరించినా, చాలా పదాలు ఈ పుస్తకంలోనివి నా ఎరుకకు రాలేదు. అందుకే అంత ఉద్వేగంగా ఈ కవితలు నేను చదవడమే గాకుండా, నా శ్రీమతికి కూడా చదివి వినిపించాను. అంత కమ్మగా అనిపించి ఎంజాయ్ చేశాము. మన శ్రీనివాస్ గున్కపూలు మల్లె పువ్వుల్లా పదాల పరిమళాలు వెదజల్లాయి. గులాబి పువ్వుల్లా ఎంతో అందంగా, పదాల అల్లికలతో కనిపించాయి. శ్రీనివాస్ తీరే వేరు అనిపించింది. నేను తెలంగాణా ఉద్యమాల సమయంలో ఎన్నో తెలంగాణా యాసపై రాసిన పుస్తకాలు సమీక్షించాను. కొన్నింటిని ఒక పుస్తకంగా ప్రచురించాను. దానికి సుధామ గారు **'అభివ్యక్తి'** అని పేరు పెట్టారు. అందులో ఎందరో తెలంగాణా కవుల పుస్తక సమీక్షలు ఉన్నాయి. తెలంగాణా గోస వుంది. తండ్లాట వుంది. అలాగే మన పాలపిట్ట వారి పుస్తకంలో





**ప్రతులకు:** అల్లాడి సుజాత
3-408/16-12
హైటెక్ కాలనీ,
మంచిర్యాల-504 208
సెల్:83416 63982

మస్తుగా ఆ ధోరణి కనిపించింది. ఎంత వయస్సొచ్చినా చిన్ననాటి ముచ్చటలు చిన్ననాటి ముచ్చటలే మరి, అంత రంజుగా వుంటాయి వినడానికి. మరి మన శ్రీనివాస్ చేసిందేమీటంటే, బాల్యాన్ని 70 యం.యం.లో కైతికాలుగా అందించారు. ఈ సమాజంలో జరుగుతున్న అన్యాయాలనూ, అక్రమాలనూ చెప్పకనే చెప్పినట్లుగా ఒక విరసం కవిలాగా మామూలు మాటల్లోనే వాతలు పెట్టారు. పదేండ్లయినా గాని గదేపేసికి నడుసుడే, తీర్పు అచ్చేనాటికి ఆడో ఈడో సచ్చుడే, న్యాయం కోసం సూసుడు కండ్లు కాయలు కాసుడే అంటూ న్యాయ వ్యవస్థలోని లోపాన్ని సున్నితంగా గరిట కాల్చి వాత పెట్టారు. చిల్లర తిరుగుళ్ళు తిరిగేవారిని ఉద్దేశించి రాస్తూ, అంటు రోగం కాదు అది, అంటించుకునేది.. సిడ్మల సుఖపడుదామని కొనుక్కునే వ్యాధి.. వారెవ్వా ఎయిడ్సు అన్ని రోగాల కన్నా గడుసు అన్నారు. ఎంసెట్ ఎందుకంటా పోరగాండ్లకో తంటా, అంటూ, రాసినోల్ల కంటే సీట్లు ఎక్కువగా వున్నాయనీ ఇంజనీరింగ్ కోసం కాలేజీలు ఎక్కువైనాయని ప్రభు త్వాలకు ఒక సూచనలాగా ఇచ్చారు. చిన్ననాటి ముచ్చట్లను చెప్పడంలో శ్రీనివాస్ ఆరితే రారు, ఎన్ని కబుర్లో, ఎన్నెన్ని కబుర్లో మరి. అన్నీ పసందుగా వున్నాయి. మర్రిసెట్టు కాడికోయి ఊడలు ఊగుతుంటయి, కోతుల గుంపుల మేము కోతులమైతుంటిమి వారెవ్వా మా ఊరు మర్రవ్వ తల్లి ఉన్నూరు. భగవద్గీత అంటే అదొక శవ జాగరణ పాట అయ్యిందని బాధపడ్డారు. అంతరిక్ష శోధనలో చంద మామను చేరినా, అంతరంగ సాధనలో పాతాళం జారినామ, సాంకేతిక పెరిగింది ఆత్మీయత తరిగింది అంటూ జనాల్లో మానవ సంబంధాలు మెరుగు పడాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. మన కవిగారి ఆలోచనా ధోరణే వేరుగా వుంది.

పాము ఇంట్ల సోత్తే పట్టు పట్టి సంపిత్తరు, నాగుల పంచమి నాడు పుట్టల పాలు పోత్తరు, వారెవ్వా భక్తులు భయంతోటే మొక్కులు. పాలు లేక బాలలు పడుతున్నరు తిప్పలు, అభిషేకాల పేరుతో పోస్తున్నరు కుప్పలు, భక్తి వుంటే తప్పు లేదు మూడభక్తి ఒప్పు కాదు అంటూనే ఏ మైసమ్మ కోరింది మంచికల్లు పొయ్యుమని, ఏ పోషమ్మ చెప్పింది పోతును బలి ఇయ్యుమని అని ప్రశ్నించారు. గదీ మనం కడుపు నిండ తినెతందుకు కక్కేదాంక తాగేతందుకే అంటూ వ్యంగ్య ధోరణి ప్రదర్శించారు. సమా జాన్ని పరిశీలించేతత్వం ఈ కైతికాలలో మస్తుగా కనిపించింది. ఎన్నో కవితలు వారెవ్వా అనేలా వున్నాయి. లక్షలాది డబ్బుంటే దోస్తారని భయం, అక్షరం అలాకాదు ఇస్తుంది అభయం.. అక్షరాన్ని నమ్ముకుంటే లక్ష్మీసరస్వతులు మీ ఇంటే నన్న కవి మాటలు ముచ్చటగొల్పాయి. అందరూ ఈ యాస లోని మాటలనూ, పదాల నూ తెలంగాణా భాష అనడం ఏమో నాకు అంత రుచించలేదు. తెలుగు భాషే తెలంగాణా భాష, కానీ యాస వేరు. అది ఈ తెలంగాణకే ప్రత్యేకం అని చెప్పాలని వుంది. విజ్ఞులైన వారు ఆలోచించాలి మరి.

ఇంత చక్కగా రాసిన మా అల్లాడి నుంచి మరిన్ని రచనలు రావాలని ఆశపడదాము.

**- డా॥ పులివర్తి కృష్ణమూర్తి**
సెల్:9949092761



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1858వ రోజు **'పోచంపల్లి చీర'** అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. **'పోచంపల్లి చీర'** అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.

-సంపాదకులు



**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం**
అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:
**-డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు,** *9441046839*

## తెలంగాణ కీర్తి కిరీటం

భూదానోద్యమంలో మేటి
వినోబాభావే బాటలో కోటి
పోచంపల్లి వికసించే నాటికి
వస్త్రోత్పత్తిలో దీనికేది రాదు
సాటి!!.
పురిటి గడ్డ చేనేతకు
పోచంపల్లి వస్త్రాలకు గిరాకీ
టై అండ్ డ్రై పద్ధతి
ఇక్కత్ కు ఉన్నది గిరాకీ.
చీరకట్టులో ఔన్నత్యం
ఆడవారికి వచ్చు హుందాతనం
ప్రపంచ ప్రఖ్యాతి గాంచి
అందరి మెప్పును పొందే.
నేల నాలుగు చెరగులా
వ్యాప్తి చెందిన వైనం
ఖ్యాతి గడించింది నేడు
వంద వత్సరాల శ్రమ ఫలితం
చుక్కలకే ప్రత్యేకతగా నిలిచే
నేతన్న హస్తకళా వైచిత్రి
మగ్గం కళాకారుల వైభోగం!!.
గోపురం అంచు డిజైన్
ఓ విధమైన చుక్కల డిజైన్
నాణ్యతకు చిరునామా
నారీ మనసు దోచిన తనం!!.
తరతరాల చరిత్రకు ఆనవాలు
తెలంగాణ రాష్ట్రానికి మకుటం
భారతదేశానికి మణిహారం
చేనేత వస్త్ర ధారణ అపురూపం
ఆడవారి ఆత్మీయతకు
నిదర్శనం!!.

**-డా.చీదెళ్ల సీతాలక్ష్మి**

## తెలుగువారి చేనేత కళావారసత్వం

స్త్రీ సోయగాన్ని పెంచే పోచంపల్లి చీరలు
తెలుగువారి చేనేత కళా వారసత్వాలు
భూదాన పోచంపల్లి పట్టణ సొంతాలు
ప్రత్యేక ఇక్కత్ శైలి వీటి ప్రత్యేకతలు
విశిష్ట రంగుల కలయిక వీటి అందాలు.
దారాలకే ప్రత్యేక రంగుల అద్దికలు
ఇక్కత్ శైలిలోని చీరల విశిష్టతలు
ఈ చీరలందుకే మగువలకు మక్కువలు
కాలేదవి తెలుగు నేలకే పరిమితాలు
అయ్యాయవి విశ్వవ్యాప్త ప్రఖ్యాతలు
నమూనాలో, ఆకృతిలో ఈ చీరలు
వేటికవే ప్రత్యేక రూప కల్పనలు
మక్కువపడి భారతదేశ మహిళలు
ముచ్చటైన పోచంపల్లి చీరలు
దర్పానికి దర్పం-అందానికి అందం
పోచంపల్లి చీరల సొంతం.

**-జె.వి.కుమార్ చేపూరి**

## వందనం

వలపుల రాణి
సొగసుల పూబోణి
అందాల అలివేణి
ముగ్ద మనోహర రాణి.
ముద్ద మందారం.
మన తెలంగాణ తల్లి ఆయువు పట్టు.
అపరంజి బొమ్మలను
మగ్గంలోంచి దారాలతో పెనవేసి
మనందరినీ ఆకట్టుకున్న మయూరి.
మనముందున్న వయ్యారి బొమ్మ.
యాదాద్రి భోనగిరి జిల్లాలో నెలకొన్న
భూదాన్ పోచంపల్లి చీరకు వందనం.

**-సంతపురి నారాయణరావు**

## ప్రత్యేకత

అందాలొలుకు చీర
రసరమ్య భామకి మెరుపు
హస్తకళా శైలి నాణ్యతతో నిండైన వస్త్రం
భిన్నమైన ఆకృతులు
సొగసులు దాచే చీర
తరుణీమణిని
అందంగా చూపే పోచంపల్లి చీర
నాణ్యతకు పెట్టింది పేరు .
వలపులకే వల వేసే చీర
సంస్కృతిని పెంపొందించే చీర
నేతన్న కష్టార్జితం
చేనేతకు ప్రత్యేక ప్రతీక .
పోచంపల్లి చీర
అందాల భామలు
మెచ్చేది ఇష్టపడేది
జగతిలో ప్రత్యేకతని
చాటి చెప్పిన చీర
విదేశీయులు సైతం
ముచ్చటపడ్డది పోచంపల్లి చీర.

**-ఆర్. ప్రవీణ్**

## అద్భుత కలనేతధార!

సౌందర్యానికి ఆటపట్టు చేనేతలు
ఇక్కత్ ప్రింటులో పోచంపల్లి చీరలు
చిత్రం విచిత్రమైన కళారూపాలు
ఆలయ శిఖరాల ఆకృతి అంచులు!!.
మగ్గం గుంటలో మానుష ఏకాగ్రత
మదిలో ఊహల సృజనాత్మక వేదిక
మొగ్గలు ఆకులు చుక్కల్లో వస్త్రాలు
అగ్గిపెట్టెలో ఇమిడే చీర పద్మశ్రీ విజేతలు!!.
తరతరాలుగా తరగని నైపుణ్యం
ఆధునిక కాలంలో మార్పుల అనివార్యం
ప్రపంచ గుర్తింపు పొందిన వారసత్వం
పోచంపల్లి సంప్రదాయ వేడుక సూత్రం!!.

**-ఎం.వి.ఉమాదేవి**

## అందంగా!

సిరులొలికించే చీర
హస్తకళా నైపుణ్యంతో
సొగసులద్దుకొన్న చీర
సంస్కృతీ సంప్రదాయాలకు
నిండుగా
తొణకని లావణ్యంతో
తరుణీమణిని జవరాలిగా
వలపుల వలరాణిగా చిత్రించిన చీర.
పడుగూ పేకా ఒడుపుగా వేస్తూ
మగ్గంపై
నిలువూ-అడ్డం దారాల పోగులను
పట్టు బిగించి
నేతన్న చేతల
జిలుగుల వన్నెల వగలమారి
ఊహల రాణిగా
కలలో కొంటెగా కవ్వించే
పోచంపల్లి చీర.
లోకం మెచ్చిన తెనుంగుల
ప్రాభవాన్ని చాటుతూ
నేతన్నల ప్రావీణ్యతతో
ప్రపంచ ప్రసిద్ధి గాంచిన చీర
పోచంపల్లి చీర.

**-పి.పద్మావతి**

## గర్వకారణం

పోచంపల్లి చీరలు తయారవుతాయి
భువనగిరి జిల్లా పోచంపల్లి లో
మొదట చేనేత చీరలు.
తర్వాత మొదలు పెట్టారు పట్టు చీరలు.
మహిళల మదిని దోచే చీరలు.
మంచి మంచి డిజైన్లలో
తయారయ్యే చీరలు.
మహిళల అందాన్ని
ద్విగుణీకృతం చేసే చీరలు.
వేడుకలకు కట్టగలిగే చీరలు
అందమైన రంగురంగుల చీరలు.
నేస్తారు
పోచంపల్లి చేనేత కళాకారులు
నిలువు పేకల మగ్గంపై.
చేనేత కళాఖండాలకు
మంచి గుర్తింపు ఉంది ప్రపంచ
వ్యాప్తంగా.
చీరాల నుండి
ఈ ప్రాంతానికి వచ్చిన పనితనం
తెలంగాణలోనే కాక
వేరే ప్రదేశాలలో కూడా వ్యాప్తి
తెలంగాణ గాంధీ
కొండా లక్ష్మణ్ బాపూజీ చొరవతో.
మాంసకృత్తిని
పట్టు నుంచి తీసేస్తారు.
దానివల్ల బట్టకు మెరుపు వస్తుంది.
పోచంపల్లి చీరలు
విదేశీ మహిళలకూ ఆకర్షణీయం
ఒకప్పుడు అగ్గిపెట్టెలో పట్టే చీరలు
పోచంపల్లి ఇక్కత్ చీరలూ
ప్రసిద్ధి చెందాయి.
టైయింగ్- డైయింగ్‌లో 18 అంకాలు
బండిళ్లకొద్దీ దారానికి
రంగుల అద్దకం
పోచంపల్లి చీరకు
భౌగోళిక గుర్తింపు
మేధో సంపత్తి హక్కుల పరిరక్షణ
మన రాష్ట్రంలోని
పోచంపల్లి చీరలు
ప్రపంచ ప్రఖ్యాతి చెందడం
మనకు గర్వకారణం.

**-డా.షహనాజ్ బతుల్**

## చేనేత కావ్యం


పోచంపల్లి మగ్గం మీద
పురుడు పోసుకున్న చీర
పుణ్యస్త్రీ సౌభాగ్యాల తెర
సంస్కృతి సంప్రదాయాల సారె!.
నడయాడే రంగుల కల
నవయవ్వని నవ్య కోరికల వల
వలపుల సోయగాల దొంతర
సుందర స్వప్నాల ముందర!.
చేనేతకారుని చేతి స్పర్శలో
చేతి కళల ప్రతిభ దారాల్లో
రంగు రంగుల కలయిక పోగుల్లో
మెరిసే వర్ణచిత్రాల చీర తీరులో!.
మగ్గంలో నిండిన పనితనంలో
జీవం పోసుకునే రేఖల కళ
త్యాగమయ జీవన శైలి
బతుకు బాటల నిజమైన లీల!.
ఇకత్ రీతుల జియోమెట్రిక్ వెలుగులు
దారపు పోగులలో దాగిన మెరుపులు.

**-గుండవరం కొండల్ రావు**

## ఎంతముద్దుగుండాదో!

ఎంత ముద్దుగుండాదో సిట్టితల్లీ
ఎం సక్క కట్టినవ్!
కదలకుంట
కొంగు దోపినవ్!
సిన్ని సెవులకు జుంకీలు
వేలాడే జడకీ గంటలు.
భూదానోద్యమంకే పునాది పోచంపల్లి
నేడు దునియాలో నీ సీరలకే డిమాండ్
ఇక్కత్ నేత లో ఇజ్జత్ కాపాడుతా
అగ్గిపెట్టెలో దాగుకొని
కండెల నుంచి బాబిన్లకు
ఎక్కించడమే గొప్ప
టైయింగ్ డైయింగ్ తో
నీకే డిమాండ్!.
కర్నాటి అనంత రాములు
నేర్పిండు- తొవ్వ సూపిండు
ఇక్కత్ షురువాయే
నూలు నుంచి పట్టుసీరెలతో
ముద్దుగుమ్మల ముచ్చటలాయే.
రెండు వైపులా ఒకే డిజైన్
చుక్కలు మక్కువ గొల్ప
అలలు మనసుల ఊయలలూప
గుడిగోపురం అంచులు
భక్తిభావంతో ఎరుపు-నీలం
పసుపు- ఆకుపచ్చల సింగారాలు
పదిహేను రోజుల నేతన్నల కష్టం
యునెస్కో గురుతుతో
నేరుగా భేటీ
పోచంపల్లి నీకు నీవే సాటి.

**-ఎ.రాజ్యశ్రీ**

తెలుగు భాషా సంరక్షణ సంఘం - తెలంగాణ
వి.ఎన్.ఆర్. ఫౌండేషన్ - ఆల్ఫోర్స్ విద్యాసంస్థలు
ఆహ్వానం
కవి, రచయిత, కాలమిస్ట్, వక్త
లయన్ కెప్టెన్ డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి రచించిన
మధుపాళి.... సమకాలీనం.... వ్యాస సంపుటి
గ్రంథ ఆవిష్కరణ సభ
తేది 27-8-2026, గురువారం
మ॥ 1-00 గం॥లకు
ముఖ్య అతిథి-గ్రంథ ఆవిష్కర్త :
ఆచార్య అనిశెట్టి రవీంద్రనాథ్
వైస్ ఛాన్సిలర్, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ కాశ్మీర్
వేదిక : జిల్లా కేంద్ర గ్రంథాలయము, కరీంనగర్.
సభాధ్యక్షులు : డా॥ వి. నరేందర్‌రెడ్డి, చైర్మన్ ఆల్ఫోర్స్ విద్యాసంస్థలు
విశిష్ట అతిథులు : శ్రీ దాస్యం సేనాధిపతి, రాష్ట్ర అధ్యక్షులు, తెలుగు భాషా సంరక్షణ సంఘం
శ్రీ సత్తు మల్లేశం, చైర్మన్ కరీంనగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ
గౌరవ అతిథి : శ్రీమతి శశిజా దేవి, సెక్రటరీ, కరీంనగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ
అభినందనలతో...
శాతవాహన లయన్స్ క్లబ్ - లీడ్ ఇండియా నేషనల్ క్లబ్


# సీనియర్ జర్నలిస్ట్ శంకర నారాయణ రచించిన అరణ్య శతకం ఆవిష్కరణ



అరణ్య శతకం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కళా జనార్ధనమూర్తి.

హైదరాబాద్, ఆగష్టు 26:(నేటినిజం ప్రతినిధి): సీనియర్ జర్నలిస్ట్ శంకర నారాయణ తన చుట్టూ ఉన్న సమాజాన్ని ఆకలింపు చక్కని, చిక్కని రచనలు చేస్తున్నారని శ్రీ త్యాగరాయ గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో గానసభలోని కళా సుబ్బారావు కళా వేదికలో, తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ప్రముఖ జర్నలిస్ట్, హాస్యావధాని శంకర నారాయణ రచించిన **'అరణ్య శతకం'** ఆవిష్కరణ సభను నిర్వహించారు. ఈ సభలో ముఖ్య అతిథిగా గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి పాల్గొని అరణ్య శతకం పుస్తకం ఆవిష్కరించారు. అనంతరం జనార్ధనమూర్తి మాట్లాడుతూ ఇప్పటి వరకు ఏభై శతకాలు శంకర నారాయణ రాశారనీ, చక్కని అంశాలను తీసుకొని శంకర నారాయణ రాసిన అరణ్య శతకం పర్యావరణను, ప్రకృతిని కాపాడేందుకు అరణ్యాల అవసరం తెలుపుతూ.. శతక పద్యాలు రాసారని అన్నారు. అడవి తల్లిని అమృత వల్లిగా భావించటం అర్థవంతంగా ఉందని ఆయన ఉదహరించారు. ఈ వేదికపై రచయిత శంకర నారాయణ తన అరణ్య శతక సంపుటిని ప్రముఖ రచయిత్రి, అటవీశాఖ ఉన్నత అధికారి దేవనపల్లి వీణావాణికి లాంఛనంగా అంకితమిచ్చారు.

దేవపల్లి వీణావాణి మాట్లాడుతూ.. శంకర నారాయణ కేవలం పది పదిహేను రోజులలో అడవులను అంశంగా గ్రహించి వంద పద్యాలు రాయడం ఆయనకు మాతృభాషపై ఉన్న సాధికారతకి నిదర్శనం అన్నారు. సులభ శైలిలో వున్న అరణ్య శతకంలోని ప్రతి పద్యం ప్రతి ఒక్కరూ తప్పక చదివి అడవులు ప్రాధాన్యత అర్థం చేసుకోవాలని ఆమె అన్నారు. రచయిత శంకర నారాయణ తాను రచించిన అరణ్య శతకంలోని పద్యాలు గురించి వివరంగా మాట్లాడారు.

ఈ వేదికపై బాల సాహితీ రచయిత చొక్కాపు వెంకటరమణ, సినీ దర్శకుడు మల్లం రమేష్ పాల్గొన్నారు.

# "బడి మొగ్గలు" ఆవిష్కరణ



పుస్తకావిష్కరణలో అతిథులు

హైదరాబాద్, ఆగష్టు 26:(నేటినిజం ప్రతినిధి): పాలమూరు జిల్లా ప్రముఖ కవి డా॥భీంపల్లి శ్రీకాంత్ రచించిన **"బడి మొగ్గలు"** పుస్తకాన్ని ఆ జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆవిష్కరించారు. ఆగష్టు 21 న మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి జీవితానికి దిశానిర్దేశం చేసే బడి గురించి, ప్రభుత్వం కల్పించే మౌలిక సదుపాయాల గురించి రచయిత రాయడం ఉపాధ్యాయ వృత్తి పట్ల ఉన్న గౌరవభావం తెలియజేస్తుందన్నారు. ప్రభుత్వ బడులను బలోపేతం చేసే దిశలో ఇలాంటి రచనలెన్నో దోహదపడుతాయన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి డా.ఐ. విజయకుమారి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించే విధంగా ఈ పుస్తకం రూపుదిద్దుకుందన్నారు. జిల్లాలోని ఉపాధ్యాయులందరూ బడులను, విద్యార్థులను ప్రోత్సహిస్తే వారిలో ఉన్న నైపుణ్యాలను వెలుగులోకి వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎ.ఎం.ఓ. దుంకుడు శ్రీనివాస్, జి.సి.డి.ఓ. అస్రాఖాద్రి తదితరులు పాల్గొన్నారు.

# దాశరథికి ఘన నివాళి



దాశరథి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అతిథులు

హైదరాబాద్, ఆగష్టు 26:(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ సాహిత్య అకాడమీ సౌజన్యంతో తెలుగు భాష చైతన్య సమితి ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత డాక్టర్ దాశరథి రంగాచార్య జయంతి వేడుకలను సోమవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి మాట్లాడుతూ.. దాశరథి రంగాచార్య సాహిత్య అధ్యయనం తెలంగాణ సమాజానికి ఎంతో అవసరమన్నారు. సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి మాట్లాడుతూ.. మార్క్సిజాన్ని వేదాలను వడబోస్తే వచ్చేది దాశరథి రంగాచార్య సాహిత్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు భాషా చైతన్య సమితి అధ్యక్షులు బడేసాబ్, తెలుగు భాషా చైతన్య సమితి ప్రధాన సంపాదకుడు డాక్టర్ విజయ ప్రకాశ్, దాశరథి కుమారుడు విరంచి, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# నలిమెల భాస్కర్‌కు దేవులపల్లి పురస్కారం



నలిమెల భాస్కర్‌కు దేవుపల్లి పురస్కారం అందజేస్తున్న అతిథులు

హైదరాబాద్, ఆగష్టు 26:(నేటినిజం ప్రతినిధి): డాక్టర్ దేవులపల్లి రామానుజ రావు 103వ జయంతిని సోమవారం సాయంత్రం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో ఘనంగా నిర్వహించారు. బహుభాషావేత్త డాక్టర్ నలిమెల భాస్కర్‌కు దేవులపల్లి పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి సారస్వత పరిషత్ కార్యక్రమాల సమన్వయకర్త గిడుగు రామ్మూర్తి స్వాగతోపన్యాసం చేశారు. డాక్టర్ దేవులపల్లి రామానుజరావు పరిషత్‌కు పూర్వ అధ్యక్షులుగా దశాబ్దాలుగా తెలుగు భాష సేవలను గుర్తు చేస్తూ గోల్కొండలాంటి గొప్ప పత్రికలకు సంపాదకత్వం వహించారన్నారు. పరిషత్ అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి ప్రసంగిస్తూ.. రామానుజరావు తెలంగాణ వైతాళికుడన్నారు.

ఆయన రచించిన గ్రంథాలు ప్రవహించే సప్తనదుల సంగ్రహం లాంటిదన్నారు. ఈ కార్యక్రమంలో పరిషత్ కోశాధికారి మంత్రి రామారావు తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వమా - మరణించకుమా



**కవితార్చన**
అడ్మిన్: **డా॥రాధాకుసుమ**
సెల్:99892 41319
"కుసుమ ధర్మన్న కళా పీఠం" సంస్థ ప్రతిరోజు కవిత్వ రచన చేయిస్తుంది. అందులో ముఖ్యమైన కొన్ని కవితలను నేటినిజం పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం..

మానవ హృదయాల
మందిరాలలో
మంగళదీపమై వెలుగుమా!
మమతల మల్లెల పరిమళమై
మనసులలో విరియుమా,
ప్రేమ-దయ-సేవల త్రివేణిగా
లోకహృదయాలను
పవిత్రం చేయుమా!
తనపై తనకున్న విశ్వాసమే తొలి విజయసోపానమని చాటుమా,
ఇతరులపై నమ్మకమే ఇనుపగోడల్ని కరిగించే
స్నేహసేతువని పలుకుమా
మాటలో మాధుర్యం, చేతలో సహాయం,
హృదయంలో దయను నింపి
మనిషిని మనిషితో కలిపే మానవబంధాన్ని బలపరచుమా!
తల్లిదండ్రుల పాదాల చెంత ప్రత్యక్ష దైవాన్ని దర్శించి,
వారి ముడతలలో జీవితానుభవాల మహాగ్రంథాన్ని చదువుమా
వారి వృద్ధాప్యానికి వసంతమై, వారి కన్నీటికి చిరునవ్వై
చిరుకృతజ్ఞతతో సేవించుటే శ్రేష్ఠమైన పూజని చాటుమా!
వృద్ధుల వణికే చేతికి ఆప్యాయతగా చేయూతనివ్వుమా
ఒంటరి హృదయానికి ఒక్క మాటతోనైనా ఊరటనివ్వుమా
విశ్వాసపు వటవృక్షమై బంధాలకు నీడనివ్వుమా
కరుణా జలధారలై కఠిన హృదయాలను కరిగించుమా!
ఆకలితో అలమటించే వానికి అన్నపూర్ణవై నిలువుమా
ఆవేదనలో ఉన్న ప్రాణానికి ఆత్మీయ ఆలంబనవై వెలుగుమా
పడిపోయిన మనిషిని ప్రశ్నించక ముందే చేయూతనివ్వుమా
పరాయివాడనే పదాన్ని
మనసు నిఘంటువునుండి తొలగించుమా!
తప్పును చూసి తిట్టడం కాదు..
మారే మార్గం చూపుమా,
క్షమాగుణంతో గాయపడిన హృదయాలకు ఔషధమవుమా;
నమ్మకపు నదిలా నరనరాల మధ్య నిత్యమై ప్రవహించుమా
ప్రతి హృదయంలో మానవీయ మమతను నిరంతరం నిలుపుమా!
కులమత భాషా ప్రాంత భేదాల కంచెలను కూలదోసి,
సమత్వపు సూర్యకాంతిలో సమస్త హృదయాలను నిలుపుమా
ద్వేషపు ముళ్లను తొలగించి సౌహార్దపు పూలను నాటుమా
సహజీవన సుగంధంతో సమాజవనాన్ని స్వర్గసీమగా మార్చుమా!
మనిషి కన్నీటిని తన కన్నీటిగా భావించిన క్షణమే
మానవత్వం, మనిషి సంతోషాన్ని
తన సంతోషంగా పంచుకున్న క్షణమే మహాత్మ్యం
మనిషి మనిషికి నీడగా, నడకకు తోడుగా నిలిచిన వేళ
భూమిమీదే శాంతి, హృదయాలలోనే స్వర్గం, జీవితాలలోనే సమృద్ధి!
మానవత్వమా- మరణించకుమా!
మనిషితనం ఉన్నంతకాలం
మానవజాతి ఓడిపోకుమా!
ప్రేమ ఉన్న ప్రతి గుండె
నీ ఆలయమై నిలువనీ,
మానవత్వం ఉన్న ప్రతి మనిషి
మహామనిషిగా వెలుగనీ!

**-కె.కె. రామ్ చందర్**
94934 02139

## స్నేహం

స్పర్థ లేనిమైత్రి స్ఫటికరూపమ్ముగ
గుట్టెరిగిన చెలిమి గట్టి దగును
దెప్పి పొడుపు చెలిమి దేనికిమంచిది?
కలిసిమెలసి చెలిమి కలిమి లేమి!!.
అవసరమ్ముకొరకు నాప్యాయతనుజూపి
అవసరమ్ముకొరకు నంజలించు
అవసరాలుతీర యాది చేయగబోడు
స్నేహితుడనబోడు చెలిమి వీడు!!.
చెడ్డవారితోడ
స్నేహముజేసినా?
మారబోడుచెడుకు
మంచివాడు!
కాకి గుంపులోని
కోకిలెప్పుడుగాని!
మధుర కంఠ మెపుడు
మార్చుకొనదు!!

**-కనకయ్య మల్లముల**
9440554042

## మానకుంటే - మానవతంటే

ప్రపంచ పటములో
పచ్చదనం వెలసిపోతుంది
మొక్కలకు బదులు చేలల్లో
చేపలు మొలుస్తున్నాయి
పొలాల్లో పంటలకు బదులు
ప్లాట్లు పెరుగుతున్నాయి.
సహజం సన్నగిల్లి నీరుగారె నీవల్లే
వెలితి మూత నిండిపోయె నీవల్లే
చేతనైన చేతికి కీడు మూగె నీవల్లే
అంతలింతలు అన్నీ నీ కలిగింతలే.
వనాలకు వర్జ్యం సోకి తెల్ల ఇల్లులయ్యె
ఎండ కుండ నేలనే మొలిచె ఉక్కరించె
మతి మరచిన ఋతువులు గతి తప్పె
వానగాలి వరస తప్పటడగులే మసలె.
కళ్ళు తెరచి మొక్క మీద బుద్ధి వాల్చాలి
మనసు పెట్టి కాలుష్యం కడిగి వేయాలి
వ్యర్థాలను అర్థవంతంగా మార్చేయాలి
భవిష్యత్ ప్రణాళిక మనుగడ వైపుండాలి

**-గజ్జెల శ్రీనివాసులు**
9573364928

## మానసిక స్థితి వ్యాకులత..

ఆధునిక కాలంలో యువత పోకడలు
చాల విచిత్రంగా ఉంటున్నయానిపిస్తుంది.మంచిగా చదువుకున్న
చెడు సవాస స్నేహాల వల్ల ,విచ్చలవిడి అలవాట్ల వల్ల, ఎప్పుడై నా,
ఎవ్వరిచేతనైన ఏదైనా రుచించని మాటలు విన్న, వాటిని భూతద్దం
లో చూస్తూ, పగ తీర్చుకోవాలని ధ్యాస లో చేస్తున్న నేరాలు వారికి
ముందు ముందు కష్టాలు తెచ్చి పెడతారయని ఇంగిత జ్ఞానం
మరచి ముందు కు సాగిపోయి నేరాలు చేస్తున్నారు..
ఇలాంటి ప్రవృత్తి తల్లి దండ్రుల దృష్టికి రావు
అవి ఆ క్షణంలో తీసు కున్న నిర్ణయం వల్ల
చేసేదే, తప్పో ఒప్పో తెలియని పసితనంలో
చిన్నారులు తప్పులు చేస్తూ పట్టుబడి జీవితాన్ని అదోగతి
పాలు చేసుకుంటు న్నారు..
సమాజములో నేరం చేయటానికి ప్రత్యేక గుణాలు ఏం ఉండవు
మనుషులకు, ఒకానొక క్షణంలో మనసు దారి తప్పి చేసే నేరాలకు
వయసుతో నిమిత్తం లేకుండానే... ఆ క్షణములో జరిగి పోతాయి
అంతే...కేవలం, తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు పిల్లల
మానసిక ప్రవృత్తులను
గమనించే సమయం ఎవ్వరికి ఉండదు. అందరి ముందు రాముడు
మంచి బాలుడే, కానీ క్షణికావేశం వల్ల నేరం
జరిగిపోతుంది...విధి రాత అంతే..

**- గుండు కోటేశ్వర్ రావు,** 98499 92431


Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.
'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.